J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 41 సంచిక : 15 17.9.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## కాలగర్భంలో చరిత్రాత్మక సంస్థలు!

# వి.ఆర్ కాలేజీకి.. ఇక వీడ్కోలేనా?

### కనుమరుగు కానున్న ఎయి'డెడ్' విద్యాలయాలు




నెల్లూరు సీమలో లక్షలాదిమంది విద్యార్థులకు విద్యాభిక్ష పెట్టిన విఆర్ కాలేజీ.. ఇక్కడ చదువుకున్న విద్యార్థులను దేశస్థాయిలో సమున్నతంగా నిలిపిన కాలేజీ.. భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి వంటి మహానాయకులు, భారత రక్షణ పరిశోధన సంస్థ ఛైర్మెన్ డా. సతీష్‌రెడ్డి వంటి విఖ్యాత శాస్త్రవేత్తలకు చదువు చెప్పిన కాలేజీ..తమిళనాడు మాజీ గవర్నర్ పిసి అలెగ్జాండర్ (అప్పట్లో చరిత్ర అధ్యాపకులు) వంటివారు ఇక్కడ అయ్యవార్లుగా వచ్చి విద్య బోధించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దిన మహోన్నతమైన కాలేజీ..ఒకప్పట్లో బ్రిటిష్‌వారినే ఎదిరించి సగర్వంగా తలెత్తుకు నిలబడిన కాలేజీ...ఇప్పుడు నిస్సహాయంగా. మూగగా రోదిస్తోంది. ఇక్కడ చదువుకుని ఉన్నత స్థానాలకు వెళ్తున్న విద్యార్థులకు ఎంతో సంతోషంగా వీడ్కోలు చెప్పిన కాలేజీ..ఇప్పుడు శాశ్వతంగా అందరికీ వీడ్కోలు చెప్పబోతోంది. ఎయిడెడ్ కళాశాలలు ప్రభుత్వంలో విలీనం అవుతుండడంతో ఇంతటి చరిత్రాత్మకమైన కాలేజీ ఇక కనుమరుగవుతుందంటూ విద్యార్థులంతా కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విఆర్‌సి దయనీయస్థితిని తలుచుకుని కంటతడి పెడుతున్నారు. జిల్లాలో పలు చరిత్రాత్మక విద్యాలయాల స్థితి.. గతి కూడా దాదాపు ఇదే దుస్థితిలో ఉన్నాయి. 2 లో

# పారని రఘురామ పాచిక



- బెయిలు రద్దు కేసులో జగన్, సాయిరెడ్డిలకు ఊరట 11 లో
- సిబిఐ న్యాయమూర్తులపైన కూడా బురదచల్లే ప్రయత్నం
- నగదు బదిలీ పథకాల లబ్దిదారులలో పెల్లుబికిన ఆనందం



## జిల్లాలో నలుగురికి
# తిరుమలేశుని సేవాభాగ్యం

- రెండవసారి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి
- తొలిసారి కిలివేటి సంజీవయ్య, పచ్చిపాల సనత్‌కుమార్‌రెడ్డి
- ప్రత్యేక ఆహ్వానితునిగా 'వంశీరామ్' సుబ్బారెడ్డి



జిల్లాకు చెందిన నలుగురికి కలియుగ ప్రత్యక్షదైవమైన ఆ తిరుమలేశుని సేవాభాగ్యం దక్కింది. తిరుమల తిరుపతి దేవస్థానాల కొత్త పాలకమండలిలో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు, ప్రముఖ వ్యాపారవేత్త పచ్చిపాల సనత్‌కుమార్‌రెడ్డికి బోర్డు సభ్యులుగా, ప్రత్యేక ఆహ్వానితునిగా 'వంశీరామ్' సుబ్బారెడ్డికి ఆ దేవదేవునికి సేవ చేసే అదృష్టం లభించింది. 11 లో



# వి.ఆర్ కాలేజీకి.. ఇక వీడ్కోలేనా?

రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రయత్నాలు ముమ్మరం కావడంతో తాము చదువుకుంటున్న విద్యాలయాలు కనుమరుగవుతున్నాయనే ఆవేదన విద్యాలోకంలో పెల్లుబుకుతోంది. ఇప్పటికే ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు ఆమేరకు తమ విద్యాసంస్థలను ప్రభుత్వానికి అప్పగించేందుకు అంగీకారం తెలపడంతో ఆ విద్యాలయాల భవిష్యత్తు ఇక ఏమవుతుందో ఏమోననే ఆవేదన..ఆందోళన అందరిలో వ్యక్తమవుతోంది. ఆ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులతో పాటు బోధనేతర సిబ్బందిని కూడా ప్రభుత్వ విద్యాసంస్థల్లోకి తీసుకునేందుకు కౌన్సిలింగ్ నిర్వహించి సర్దుబాటు చేసేందుకు అధికారులు చర్యలు ప్రారంభించడంతో ఇప్పటిదాకా ఒక చోటే ఉన్న అయ్యవార్లు, సిబ్బంది ఇక ఎక్కడికి వెళ్ళిపోతారో, ఏ విద్యాలయంలో వారికి చోటు దొరుకుతుందో ప్రస్తుతానికి అంతా అయోమయమే. కౌన్సిలింగ్‌లో వచ్చే అవకాశాలే వారికి అదృష్టాలుగా మారనున్నాయి. ఈ విలీన ప్రక్రియలో నాటి ఘనమైన ఎయిడెడ్ విద్యాలయాలు రేపటికి ఏమవుతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది.

**జిల్లాలో ఎన్నో అపూర్వమైన విద్యాలయాలు :**

జిల్లాలో స్వాతంత్ర్యపూర్వం నుంచి ఎన్నో అపురూపమైన కళాశాలలు, పాఠశాలలు మనకున్నాయి. నాటి కాలంలో బ్రిటీష్ వారినే ఎదిరించి సమాజాభ్యున్నతే ధ్యేయంగా ఎంతో సేవాభావంతో అందరికీ మంచి చదువులు చెప్పిన విద్యాలయాలుగా.. చదువులతల్లికి నిలయాలుగా పేరొందాయి. విద్యారంగంలో జిల్లాకే తలమానికంగా ఉన్న నెల్లూరు విఆర్ కాలేజీ కూడా 'మూతబడి' కాబోతుండడం ఇంకా బాధాకరం. ఎప్పుడో బ్రిటీష్‌వారి కాలంలో 1875 ప్రాంతాల్లో ప్రారంభమై, 1890 ప్రాంతాల్లో వెంకటగిరి రాజా సహకారంతో నిలదొక్కుకుని 'వెంకటగిరి రాజా హైస్కూలు'గా ఎదిగింది. 1920 ప్రాంతం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్‌తో విఆర్ కళాశాలగా అభివృద్ధి చెందింది. ఆ తర్వాత కాలంలో డిగ్రీ కోర్సులు కూడా వచ్చాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక విఆర్ విద్యాలయాలు విద్యారంగంలో తమ కంటూ ప్రత్యేకస్థానంలో ఉంటూ ఉత్తమ ఫలితాలతో రాణిస్తూ అందరి ప్రశంసలు అందుకున్నాయి. ఒకప్పుట్లో వేలసంఖ్యలో విద్యార్థులతో, వందలాదిమంది విశిష్టమైన అయ్యవార్లు, సిబ్బందితో, మూడు షిఫ్టులతో ఉదయం నుంచి రాత్రి దాకా పనిచేస్తూ నిరంతర విద్యాసేవలో తరించిన కాలేజీ..ఇప్పుడు కాలగర్భంలో కలసిపోయేందుకు సిద్ధమవుతోంది. ఒకప్పట్లో వేల కోట్ల ఆస్తులు, వందలాది మంది సిబ్బందితో నడిచిన ఈ కాలేజీ ఇటీవలి కాలంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోక నిర్వీకారంగా మారింది. కొద్దిమంది విద్యార్థులు, కొద్దిమంది సిబ్బందితో అయోమయంగా తయారైన ఈ కాలేజీ విలీనానికి సిద్ధమైంది. ఇక దాని భవిష్యత్తు ఏమిటో ఆ భగవంతుడికే తెలియాలి. అదేవిధంగా జిల్లాలో ఎంతో చరిత్రగల విద్యాలయాల్లో నెల్లూరు వేదసంస్కృత కళాశాల, కస్తూరిదేవి విద్యాలయాలు, కావలిలో విశ్వోదయ, జవహర్‌భారతి విద్యాలయాలు వగైరాలెన్నో ఉన్నాయి. నెల్లూరులో సర్వోదయ కళాశాల, ఆర్ఎస్ఆర్ హైస్కూలు, ఎస్వి జిఎస్ కాలేజీ, విద్యానగర్‌లో ఎన్‌బికెఆర్, గూడూరులో డిఆర్‌డబ్ల్యు కాలేజీ, అల్లూరులో రామకృష్ణ జూనియర్ కళాశాల వంటి చరిత్రాత్మకమైన కళాశాలలకు పేరెన్నికగన్న జిల్లా ఇది. ఇప్పుడు వాటి పరిస్థితి కూడా దాదాపు ఇదే. తాము కళాశాలలు నడుపుకోగలమన్న ధీమాతో ఉన్నవారికి ధోకా లేదు కానీ, మిగిలిన కళాశాలు, పాఠశాలలకు ఇది నిజంగానే పరీక్షా సమయం.

ఈ విలీన ప్రక్రియ చివరికి ఏవిధమైన మలుపు తిరుగుతుందో తెలియదు కానీ, జిల్లాలోనే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా అనేక ఎయిడెడ్ విద్యాలయాలు ఇప్పుడు తమ శకం ముగిసిపోతోందనే భావనతో.. ఆవేదనతో తల్లడిల్లుతున్నాయి. తమ వేదన బయటకు చెప్పుకోలేక లోలోపలే మదనపడుతున్నాయి.

## ముమ్మరంగా విలీనం ప్రక్రియ

ప్రభుత్వం విలీన ప్రక్రియను ముమ్మరంగా ప్రారంభించింది. ఎయిడెడ్ విద్యాలయాల యాజమాన్యాల అంగీకారాలు తీసుకుని ఎయిడెడ్ విద్యాలయాలను ప్రభుత్వంలో విలీనం చేయడానికి సంకల్పించింది.

రాష్ట్రంలో 151 ఎయిడెడ్ కళాశాలలున్నాయి. వీటిలో డిగ్రీ కాలేజీలు కూడా ఉన్నాయి. వీటి ఆస్తులను, సిబ్బందిని ఆ యాజమాన్యాలు ప్రభుత్వానికి అప్పగిస్తే ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలగా పేరు మార్చి, అవసరమైన సిబ్బందిని ఏర్పాటుచేసి వాటిని ప్రభుత్వం నిర్వహించేందుకు నిర్ణయించడంతో ఇప్పటికే 130 కళాశాలల యాజమాన్యాలు తమ ఎయిడెడ్ సిబ్బందిని ప్రభుత్వానికి అప్పగించేశాయి కూడా. మరికొన్ని విద్యాలయాలు కూడా విలీనానికి అంగీకారం తెలిపే దిశలో ఉన్నట్లు కూడా తెలుస్తోంది.

## హడావిడి ఉత్తర్వులతో.. అంతా గందరగోళం

విలీన ప్రక్రియలో భాగంగా ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులను ప్రభుత్వంలోకి తీసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 8వ తేది అర్ధరాత్రి హడావుడిగా ఉత్తర్వులివ్వడం, వారంతా ఈనెల 11లోపే సంబంధిత ఆర్‌జెడీల వద్ద రిపోర్టు చేయాలని ఆదేశించడంతో అధ్యాపకులు ఆయా జిల్లాల్లోని ఆర్జేడి కార్యాలయాల వద్దకు పరుగులు తీయాల్సివచ్చింది. పండుగ రోజు అని కూడా చూడకుండా ఆదేశాలు జారీచేయడంతో అయ్యవార్లంతా తమ ఉద్యోగాలు కాపాడుకునేందుకు పరుగులు పెట్టాల్సివచ్చిందనే ఆవేదన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల్లో ఇప్పటికే తొలి ఏడాది పూర్తిచేసుకున్న విద్యార్థులు, రెండవ ఏడాది, మూడవ ఏడాది ఎక్కడ చదవాలన్నది కూడా ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ సాయం లేకుండా చదవాలంటే సాధ్యమా?..ఒకవేళ వీరికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని చెప్తున్నా, ఆచరణలో అది ఎంతవరకు సాధ్యమవుతుందో చెప్పలేమని విద్యార్థి వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

## 'విశ్వోదయ'ను కొనసాగిస్తాం

**డిఆర్ కుమారుడు దొడ్ల వినయ్ స్పష్టీకరణ**



విలేకర్లతో మాట్లాడుతున్న డి.ఆర్ కుమారుడు దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు

ఎయిడెడ్ విద్యాసంస్థల విలీనానికి ప్రభుత్వం అడుగులు వేస్తున్న నేపథ్యంలో, ప్రభుత్వం ఇచ్చిన ఆప్షన్ మేరకు ప్రభుత్వం ఇచ్చే ఎయిడ్‌ను వదులుకుని తమ కష్టమ్మీద విద్యాసంస్థలను నడుపుకునేందుకు కావలి విశ్వోదయ విద్యాసంస్థలు నిర్వాహకులు నిర్ణయించడం విశేషం. పేదరికం విద్యకు అడ్డు కాకూడదంటూ తమ పెద్దలు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి ఏర్పాటుచేసిన ఈ విద్యాసంస్థ ఆశయాల మేరకు ఆ సంస్థలను నడుపుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, విద్యకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని డాక్టర్ డిఆర్ కుమారుడు దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 14న కావలిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశ్వోదయ విద్యాసంస్థ దాదాపు ఏడు దశాబ్దాల తర్వాత ఇప్పుడు మరో విద్యా ఉద్యమానికి శ్రీకారం చుట్టేందుకు సిద్ధమైందన్నారు. మహోన్నత విద్యాదాత డాక్టర్ డిఆర్ ఆశయాల సాధన కోసం పూర్వ విద్యార్థులందరి కృషితో విశ్వోదయ ప్రతిష్టను మరింతగా ఇనుమడింపజేస్తామని ఆయన చెప్పడంతో విశ్వోదయ విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అంతేకాదు రెండవ, మూడవ సంవత్సరం డిగ్రీ చదువుకుంటున్న విద్యార్థులు కూడా తమ చదువులను ఇక్కడే కొనసాగిస్తామంటూ సమిష్టి నిర్ణయం తీసుకోవడం, అదేవిధంగా విశ్వోదయ బాలికల పాఠశాల వారు కూడా తమ పాఠశాలను కొనసాగిస్తామని స్పష్టం చేయడం విద్యార్థులకు ఎంతో ఊరట కలిగిస్తున్నాయి. విశ్వోదయ విద్యాసంస్థలను తీర్చిదిద్దేందుకు డాక్టర్ డిఆర్ బాటలో ఆయన కుమారుడు వినయ్‌కుమార్‌రెడ్డి మరో డిఆర్‌గా మారి పడుతున్న శ్రమకు కావలి ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి పూర్తిస్థాయిలో మద్దతు లభిస్తోంది కూడా.

## నాడు కళకళ..నేడు వెలవెల

**• ఎయిడెడ్ విద్యాలయాల.. క(వ్య)థ ఇదీ**

ఎయిడెడ్ విద్యాలయాల ఆవిర్భావానికి ఘనమైన చరిత్రే ఉంది. సమాజశ్రేయస్సును కాంక్షిస్తూ అందరికీ విద్యనందించడమే ఏకైక ధ్యేయంగా ఎన్ని అవస్థలెదురైనా నాటి విద్యాలయాలు సమాజానికి తమవంతు సేవలందించాయి. ఇందులో దాదాపు వందేళ్ళ కిందటి నుంచి ఉన్న చరిత్రాత్మక విద్యాలయాలూ ఉన్నాయి. ఇప్పటికీ అనేక విద్యాలయాల పరిస్థితి బాగానే ఉన్నా, కొన్ని విద్యాలయాలు మాత్రం నేటికీ కష్టాల సుడిలో కొట్టుమిట్టాడుతున్నాయి. కొన్నిచోట్ల అయ్యవార్లు లేక, విద్యార్థులు రాక అవస్థల్లో ఉన్నాయి. అందుకు ఆయా విద్యాలయాల నిర్వాహకుల స్వయంకృతాపరాధాలూ లేకపోలేదు. ఇలా అస్తుబిస్తుగా ఉండేకంటే చివరికి విలీనమే మంచిదనే స్థితికి వచ్చేసిన పాఠశాలలూ ఉన్నాయి. అయితే, ఇప్పటికిప్పుడు తమ విద్యాలయాలను వదిలిపెట్టేయాలంటే వారికి మనసొప్పడం లేదు. అయినా ప్రభుత్వానికి ఇవ్వకా తప్పడంలేదు. ఇది విధిలేని పరిస్థితిగా మారింది. దీంతో ఇంతకాలం నిర్వహించిన సంస్థలు, సిబ్బంది, ఆస్తులు.. చివరికి అన్నీ ప్రభుత్వ పరమైపోతే ఆ పాత బడులన్నీ..ఇక 'మూతబడులు'గానే మిగిలిపోతాయని, ఎయిడెడ్ విద్యాలయాలు కాస్తా 'డెడ్' అయిపోయి..క్రమేణా కాలగర్భంలో కలిసిపోతాయేమోనని ఆయా యాజమాన్యాల లోలోపలి ఆవేదన.

**లక్షలాదిమందికి విద్యాభిక్ష పెట్టిన విద్యాలయాలు :**

సమాజంలో సమగ్రాభివృద్ధికి, అసమానతలు చెరిగిపోవడానికి విద్య ఎంతో అవసరమనే విషయాన్ని గ్రహించిన నాటికాలంలోని పెద్దలు, దాతలు సమాజశ్రేయస్సే ప్రధాన లక్ష్యంగా.. పేద-ధనిక భేదం చూడకుండా అందరికీ విద్యనందించేందుకు రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో విద్యాలయాలు స్థాపించారు. లక్షలాదిమంది పేద విద్యార్థులకు విద్యాభిక్ష పెట్టిన విద్యాలయాలివి. ఎంతోమంది దాతలు తమ విరాళాలతో, ప్రజలందరి సహకారంతో ఈ విద్యాలయాలను క్రమశిక్షణకు మారుపేరుగా నడిపారు. విద్యార్థులు కూడా ఉత్తమ ఫలితాలతో రాణించేవారు. అప్పట్లో ఆ దాతల ఔదార్యాన్ని ఎంతో మెచ్చుకుంటూ ప్రభుత్వాలు కూడా తమవంతు సాయం (ఎయిడ్) అందించాయి. అలా ప్రభుత్వసాయం అందుకున్నవే ఎయిడెడ్ పాఠశాలలు, ఎయిడెడ్ కళాశాలలు. ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు ప్రభుత్వం జీతాలు ఇస్తుండేది. నిర్వహణా వ్యయాన్ని దాతలే భరించేవారు. ఇలా అటు దాతలు, ఇటు ప్రభుత్వం కలిసిమెలిసి విద్యాభివృద్ధికి కృషిచేసేవి. నాటినుంచి ఆ విద్యాలయాలు నిరంతరం శ్రమిస్తూ విద్యార్థులను భావిభారతపౌరులుగా తీర్చిదిద్దాయి. కాలక్రమేణా అటు విద్యాలయాల నిర్వహణలోను, ఇటు ప్రభుత్వాల తీరులోనూ వస్తున్న మార్పులతో, అనేకానేక కారణాలతో సుమారు రెండు దశాబ్దాలుగా ఈ ఎయిడెడ్ విద్యాలయాల్లో రిటైరైన వారి స్థానంలో కొత్తవాళ్ళని నియమించే పద్ధతికి తిలోదకాలివ్వడంతో విద్యాలయాల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడుతూ వచ్చింది. అదే సమయంలో మరోవైపు ప్రైవేటు విద్యాలయాలు, కార్పొరేట్ విద్యాసంస్థలు రావడంతో వాటికి డిమాండ్ పెరగడం జరిగింది. దీంతో కొన్ని ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలు ఆదరణ కోల్పోతూ..అనేక ప్రాంతాల్లో అరాకొరా సిబ్బందితో, తక్కువమంది విద్యార్థులతో త్రిశంకుస్వర్గంలో నడుస్తున్నాయి. కొన్ని ఎయిడెడ్ విద్యాలయాలు ఇప్పటికీ బాగానే ఉన్నా అనేకం ఇబ్బందుల్లోనే ఉన్నాయి. బాగా ఉన్న కాలేజీలు వాటిని నడుపుకుంటాయో లేదో ఇంకా స్పష్టం కావాల్సి ఉంది. ఈ క్రమంలో మొత్తంగా వీటి పరిస్థితి ఏమిటంటూ ప్రభుత్వం ఒక కమిటీని నియమించడం, ఆ కమిటీ నివేదిక మేరకు ఎయిడెడ్ విద్యావ్యవస్థకు మంగళం పాడేస్తూ..ప్రభుత్వం తదుపరి నిర్ణయాలు తీసేసుకోవడం చకచకా జరిగిపోయాయి.

## గురు నిలయంలో వెంకయ్యస్వామి ఆరాధన



నెల్లూరు, మూలాపేటలోని గురు నిలయంలో ఈ నెల 11, 12తేదీల్లో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి 39వ ఆరాధనోత్సవం కన్నులపండువగా జరిగింది. స్వామివారి శిష్యులు మాకాని వెంకట్రావుస్వామి కుమారుడు గోపి, కుటుంబసభ్యులు ఈ వేడుక నిర్వహించారు. 11న స్వామివారి నామ సంకీర్తనతో పురవీధుల్లో భిక్షాటన నిర్వహించారు. 12న వెంకయ్యస్వామికి, మాకాని వెంకట్రావ్‌స్వామికి పూజలు, అఖండనామ సంకీర్తన, నగరోత్సవం జరిగాయి. వెంకయ్యస్వామి వారి శిష్యులు తలుపూరు నారాయణదాసు స్వామివారు, గాలిపాళెం వెంకయ్యస్వామి ఆశ్రమ నిర్వాహకులు శ్రీహరి స్వామి, పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

## మాతృభాషలో విద్యావిధానం..
# ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తుంది



### శ్రీసిటీలో అడ్వాన్స్ స్టడీ సెంటర్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

మాతృభాషలో విద్యావిధానంతో ఆత్మ గౌరవం పెరుగుతుందని భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. తాను ఏ భాషకు వ్యతిరేకం కాదని, వీలైనన్ని ఎక్కువ భాషలు నేర్చుకోవడం మంచిదని అంటూ, అయితే ముందుగా మాతృభాష, సోదర భాష, జాతీయభాష నేర్చుకోవాలని సూచించారు. ఇటీవల ఆయన శ్రీసిటీ లోని క్రియా యూనివర్శిటీలో 'మోటూరి సత్యనారాయణ సెంటర్ ఫర్ అడ్వాన్స్ స్టడీ ఇన్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్' కేంద్రాన్ని చెన్నై రాజ్‌భవన్ నుంచి అంతర్జాల వేదిక ద్వారా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, పార్లమెంటేరియన్ మోటూరి సత్యనారాయణ పేరుమీద వారి కుటుంబ సభ్యులు మానవీయ, సామాజిక విజ్ఞాన శాస్త్రంలో పరిశోధనలను ప్రోత్సహించడం కోసం ఈ కేంద్రం ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. భారతీయ భాషలను ప్రోత్సహించడంలో మోటూరి చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ మోటూరికి ఘనంగా నివాళులర్పించారు. మానవీయ, సామాజిక శాస్త్రంలో నాణ్యమైన విద్యకు మారు పేరైన క్రియా ప్రస్థానంలో ఇదో ముఖ్యమైన మైలురాయి అని అంటూ క్రియా యాజమాన్యానికి సిబ్బందికి ఉప రాష్ట్రపతి తన అభినందనలు తెలిపారు. ఇదే తరహాలో విద్య, వైద్య, విజ్ఞాన రంగాల అభివృద్ధికి ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబాలు ముందుకు రావాలని, ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన 'నేర్చుకోవాలి, సంపాదించుకోవాలి, సమాజ అభివృద్ధి కోసం నలుగురితో పంచుకోవాలి (లెర్న్, ఎర్న్, రిటర్న్ టు సొసైటీ) అనే నినాదాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మెన్ డాక్టర్ మహేష్ రంగరాజన్ మాట్లాడుతూ మన ఉజ్వల భవిష్యత్తుకు పరిశోధనలు ఎంతో అవసరమని, అందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని వివరించారు.



ఆంధ్రప్రదేశ్ అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ పి.ఎస్.ఆర్.ఆంజనేయులు - శ్రీమతి అపర్ణల కుమారుడు **అనంత ప్రద్యుమ్న - సాహితి**ల పెళ్లి రిసెప్షన్ 15వ తేదీ బుధవారం మంగళగిరిలో జరిగింది. ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కొత్త దంపతులకు 'లాయర్' శుభదీవెనెలు.

# అక్రమ లేఅవుట్‌లకు.. ఇక చెక్



- నుడా ఛైర్మెన్ ముక్కాల

నుడా (నెల్లూరు నగరాభివృద్ధి సంస్థ)లో అభివృద్ధి పనులను ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్ తాను చెప్పినట్లే సత్వరం ప్రారంభించేశారు. ముందుగా అక్రమ లేఅవుట్‌ల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నారు. వాటిని నిరోధించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని కూడా నియమిస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. తొమ్మిదిమంది నుడా అధికారులకు ఒక్కో ప్రాంతాన్ని కేటాయించి అక్రమ లేఅవుట్లను నిగ్గుదేల్చబోతున్నారు. ఎవరైనా సరే నిబంధనల ప్రకారమే లేఅవుట్లను ఏర్పాటు చేయాలని, విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ప్రజలు నుడా పరిధిలో ఎక్కడైనా ప్లాట్లను కొనుగోలు చేసే సందర్భంలో వాటికి నుడా అనుమతులున్నాయో లేదో తప్పకుండా పరిశీలించుకోవాలని సూచించారు.

# ఉపాధి బిల్లులు సక్రమంగా చెల్లించలేరా?



- మాజీ మంత్రి సోమిరెడ్డి

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సక్రమంగా ఉపాధి హామీ బిల్లులు చెల్లించకపోవడం దారుణమంటూ మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఇటీవల ఆయన ఈ బిల్లుల విషయం ప్రస్తావిస్తూ లక్షల్లో పనులు చేసిన వారికి వేలల్లో బిల్లు చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇది ఇన్యాయమని అన్నారు. రూర్బన్ పనుల్లో క్వాలిటీ లేదనుకుంటే, పనులు పర్యవేక్షించిన వారిపై చర్యలు తీసుకోవాలి గాని, పనులు చేసిన వారిపై రికవరీలు పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఒక్కో పనిలో 96 శాతం వరకు రికవరీ పెడతారా?.. 16 లక్షల రూపాయల పనికి కేవలం 58 వేలు మాత్రమే బిల్లు చేస్తారా?.. అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. అది కూడా మీరే ఉంచుకోండి.. మరీ ఇంత దుర్మార్గమా.. అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పనులు చేసినవారెవరూ అరా కొరా బిల్లులు తీసుకోవద్దని, న్యాయం కోసం న్యాయపోరాటం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా ఉన్నతాధికారులు ఇకనైనా ఈ విషయంలో జరుగుతున్న పొరపాట్లను సరిదిద్దాలన్నారు.

# జెఇఇ మెయిన్స్‌లో 'విశ్వసాయి' ప్రతిభ




జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ నిరూపించుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించారు. టి.పురందేశ్వర్‌రెడ్డి 98.01, డి.కార్తికేయ 97.73, వై.శ్యామ్ సాయి 97.35, కె. రీతూహాసిని 97.22, కె.లక్ష్మీలాస్య 97.16, వై.విద్య 96.87, డి.యశ్వంత్‌రెడ్డి 96.78, జి.శాంతిస్వరూప్ 96.75, ఐ.వేదసాయిప్రియ 96.25, జి.శ్రీరాం 95.69 పర్సంటైల్స్‌ను సాధించారు. 90 పర్సంటైల్స్ కంటే ఎక్కువ సాధించిన వారు 23 మంది, 80 పర్సంటైల్స్ కంటే ఎక్కువగా 24 మంది, మొత్తంగా 153 మంది తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం ఎంతో సంతోషకరమని అంటూ ఆ విద్యార్థులందరినీ కళాశాల ఛైర్మెన్ డా.ఎన్.సత్యనారాయణ, వైస్ ఛైర్మెన్ కృష్ణమోహన్‌లు అభినందించారు.






## 'ప్రభా'తం

దేశాన్ని కరోనా ఇంకా కాల్చుకుతింటూనే ఉంది. అసలే ఆర్థికస్థితి అంతంతమాత్రంగా ఉన్న దేశం.. గత రెండేళ్ళుగా కరోనా దెబ్బతో విలవిలలాడుతూనే ఉంది. ఒకవైపు దొరికినవారిని దొరికినట్టు చంపుకుతింటూనే మరోవైపు బతికున్న ప్రజలను కూడా నానా రకాలుగా వేపుకుతింటోంది. ఇప్పటికే దేశంలో ఈ వ్యాధితో మరణించిన వారి సంఖ్య 4 లక్షలా 42 వేలకు పైగా ఉంటే, మరో 3 కోట్లా 32 లక్షల మందికి పైగానే ప్రజలు ఈ రాకాసి బారిన పడి పడుతున్న బాధలు వర్ణనాతీతం. మరణించిన కుటుంబాల వారు, వ్యాధితో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న వారి పరిస్థితి నరకయాతనగానే ఉంది. ప్రభుత్వాలు, అధికారులు, వైద్యుల కృషితో కోట్లాదిమంది ప్రజలను ఈ వ్యాధి విషపుకోరల నుంచి కాపాడుతూనే ఉన్నా, నిత్యం ఇంకా అనేకమందిని ఈ వ్యాధి చుట్టుముడుతూనే ఉంది. కేసులు పెరుగుతూనే ఉన్నాయి. చావులూ పెరుగుతూనే ఉన్నాయి. ఈ విలయం ఇంకా ఎన్నాళ్ళో ఆ దేవుడికే తెలియాలి. ఏ చెట్టుకు అంత గాలి అన్నట్లుగా కరోనా దెబ్బతో అన్నివర్గాల ప్రజలు కష్టాల పాలవుతుంటే, సామాన్యులు, కష్టజీవుల జీవనం ఇంకా దుర్భరంగా తయారైంది. ప్రభుత్వాలు ఎన్నిరకాల పథకాలు ప్రవేశపెట్టినా కోట్లాదిమంది ప్రజలు ఎలాంటి ఆదరవూ లేక అత్యంత దయనీయస్థితిలో బతుకులీడుస్తున్నారు. కరోనా ధాటికి బీదాబిక్కీ బడుగు ప్రజల జీవితం.. అనేక రకాల పరిశ్రమల్లో పనిచేసుకుని పొట్టపోషించుకునే కార్మికుల జీవనం నేటికీ అల్లకల్లోలంగానే ఉన్నాయి. 2020 మార్చిలో కరోనా నేపథ్యంలో దేశంలో లాక్‌డౌన్ వచ్చి ప్రజల ప్రాణాలను కాపాడినా, బతుకుతెరువులను నిలబెట్టుకోలేకపోయాం. కోట్లాదిమందికి ఉపాధి, ఉద్యోగాలు కోల్పోయి పరిస్థితి అంతా అయోమయంగా మారింది. క్రమేణా కోలుకుని గాయాలు మాన్పుకుంటున్న దశలో ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో మళ్ళీ కరోనా రెండోదశ అంటూ దెబ్బమీద దెబ్బ వేసింది. తగిలిన కాలికే దెబ్బ తగులుతుందన్నట్లుగా నిరుద్యోగుల జీవితాలు తిరిగి కోలుకోలేనంతగా చతికిలబడిపోయాయి. ఇప్పుడు మళ్ళీ మూడోదశ కరోనా అంటున్నారు. అదేకనుక వస్తే ఇక పరిస్థితి ఎంత ఘోరంగా ఉంటుందో తెలియదు. ఒకవైపు దేశ ఆర్థికవ్యవస్థను గాడిలో పెట్టేందుకు కేంద్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంస్కరణలు, ఆర్థికవృద్ధికి చేస్తున్న ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తున్నాయని అనుకుంటున్న తరుణంలోనే మరోవైపు ఏదో ఒక సమస్య చుట్టుముడుతూనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా కరోనా చావుబాజా మోగిస్తూ విలయతాండవం చేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో దాదాపు అన్ని దేశాల పరిస్థితి కూడా అస్తవ్యస్తంగానే ఉంది. అయితే వాస్తవానికి అనేక దేశాలకంటే ధీటుగా మనదేశం ఎలాగో కోవిడ్ నుంచి తట్టుకుంటూ, ఇతరత్రా సమస్యలను కూడా అధిగమిస్తూ ఇప్పుడిప్పుడే ముందుకు సాగుతోండడం సంతోషకరం. కానీ కరోనా మాత్రం పూర్తిస్థాయిలో వదలకపోవడంతో అనేకరంగాలు ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడలేకపోతున్నాయి. ముఖ్యంగా పారిశ్రామిక రంగం ఇంకా కష్టనష్టాల సుడిగుండాల్లో కొట్టుమిట్టాడుతూనే ఉంది. ఫలితంగా ఉద్యోగులను పోషించలేక, శ్రామికులకు వేతనాలివ్వలేక పరిశ్రమలనే మూతవేసే స్థితి దాపురించింది. దీంతో నిరుద్యోగం మళ్ళీ ప్రబలిపోతోంది. గత నెల..అంటే ఆగస్టు నెలలో దేశంలో నిరుద్యోగం రేటు మళ్ళీ బాగా పెరిగిపోయిందని, గత జులై నెలలో 7 శాతానికి తగ్గిన నిరుద్యోగం రేటు ఆగస్టుకు వచ్చేసరికి ఒక్కసారిగా 8.3 శాతానికి పెరిగిందంటూ తాజాగా సిఎంఐఇ (సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ) వెల్లడించింది. దేశం మొత్తమ్మీద సంఘటిత, అసంఘటిత రంగాల్లో ఒక్క ఆగస్టు నెలలోనే 1.9 మిలియన్ల మంది ఉద్యోగాలు కోల్పోయారని, అదే సమయంలో ఉద్యోగిత రేటు క్షీణించిందని, జులై నెలలో 37.5 శాతంగా ఉన్న ఉద్యోగిత రేటు ఆగస్టు నెలకు 37.2 శాతానికి పడిపోయిందని, పారిశ్రామిక రంగంలో ఉద్యోగాలు ఈ ఏడాది జులైలో కంటే ఆగస్టు నెలలో ఒక్కసారిగా 2.5 మిలియన్లు తగ్గిపోయాయని సిఎంఐఇ అధ్యయనాలు పేర్కొంటున్నాయి. అంతేకాదు, ఉత్పత్తి రంగం ఈ కరోనా కారణంగా దాదాపు 10 మిలియన్ల ఉద్యోగాలను శాశ్వతంగా కోల్పోయిందని కూడా వివరించింది. వ్యాపార రంగం వంటి పలు రంగాల్లో ఉద్యోగాలు పెరిగినప్పటికీ పారిశ్రామిక, ఉత్పత్తి రంగాలపై కరోనా తన ప్రభావం బాగా చూపుతోందని ఈ అధ్యయనాల వల్ల తేటతెల్లమవుతోంది. దేశంలో అనేకరంగాలు కరోనా విపత్తును తట్టుకుని ఎంతో కొంత అభివృద్ధి సాధించడానికి ఇప్పటికే ప్రభుత్వాలు చేస్తున్న కృషి చిన్నదేమీ కాదు. అయినా ఇంకా చేయాల్సింది ఎంతో ఉంది. కోట్లాదిమంది ఉద్యోగులు జీవనభృతి కోల్పోయి వారి కుటుంబాలు అత్యంత దీనస్థితిలో ఉండడం, శ్రామికులు ఆకలి కేకలతో అలమటించడం ఎంతైనా బాధాకరం. దేశానికి వెన్నెముక లాంటి రంగాల్లో వ్యవసాయం తర్వాత పారిశ్రామిక, ఉత్పత్తి రంగాలేనన్నది అందరికీ తెలిసిందే. దేశ అభివృద్ధికి బాటలు వేసే ఈ రంగాలు కుదేలైపోవడం విచారకరం. ఈ కష్టాలను అధిగమించేలా వెంటనే వారిని ఆదుకునేందుకు కేంద్రప్రభుత్వంతో పాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సరికొత్త ప్రణాళికలను, క్షేత్రస్థాయిలో కార్మికులకు నేరుగా సహాయం అందించగలిగే మానవీయ సంస్కరణలను అమలుచేయాల్సి ఉంది. ఈ కరోనా కష్టకాలంలో అసహాయ స్థితిలో ఉన్న కార్మికులకు, నిరుద్యోగులకు అన్నివిధాలా చేయూతనిచ్చి తిరిగి వారి జీవితాలకు భరోసా కల్పించాల్సి ఉంది. అదే సమయంలో మళ్ళీ నిరుద్యోగం ఇక పెరగకుండా ఉండేందుకు ముందస్తు ప్రణాళికలతో ప్రభుత్వాలు ముందుకు రావాల్సి ఉంది.

# పెరిగిపోతున్న నిరుద్యోగం

**కరోనా దెబ్బతో మళ్ళీ నిరుద్యోగం ప్రబలిపోతూనే ఉంది. గత ఆగస్టులో ఒక్కసారిగా నిరుద్యోగం రేటు 7 నుంచి 8.3 శాతానికి పెరిగిందంటూ తాజాగా సిఎంఐఇ(సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ) వెల్లడించింది. దేశం మొత్తమ్మీద సంఘటిత, అసంఘటిత రంగాల్లో ఒక్క ఆగస్టు నెలలోనే 1.9మిలియన్ల మంది ఉద్యోగాలు కోల్పోయారని కూడా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పారిశ్రామిక, ఉత్పత్తి రంగాలను అల్లకల్లోలం చేస్తున్న ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు, జీవనభృతి కోల్పోయిన కోట్లాదిమంది కార్మికులను వెంటనే ఆదుకునేందుకు కేంద్రప్రభుత్వంతో పాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాల్సిఉంది. అసహాయస్థితిలో ఉన్న కార్మికులకు, నిరుద్యోగులకు చేయూతనిచ్చి వారి జీవితాలకు భరోసా కల్పించాల్సి ఉంది.**

# రంగస్థల నటుడు శ్రీధర లక్ష్మీనరసింహం.. ఇక లేరు



సుప్రసిద్ధ రంగస్థల, సినీనటుడు, వ్యాఖ్యాత, వెంకటగిరి వాస్తవ్యుడు శ్రీధర లక్ష్మీనరసింహం(92) ఇక లేరు. ఈనెల9న అనారోగ్యంతో నెల్లూరులో తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన సతీమణి కమలమ్మ పదకొండేళ్ళ క్రితం మరణించారు. 1952 నుంచి 1987 డిసెంబరు దాకా ఆయన పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి రిటైరయ్యారు. తిరుపతి, వెంకటగిరిల్లో కూడా అదే శాఖలో పనిచేసి క్రమశిక్షణ, నిజాయితీ కలిగిన అధికారిగా పేరొందారు. నెల్లూరులోని సర్వోదయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డా.కాళిదాసు పురుషోత్తం ఈయనకు బావమరిది. అంతేకాదు, విఆర్ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ డా.ఎం. సుబ్రహ్మణ్యంకు ఆయన స్వయానా మామగారు కూడా.

వీరి స్వస్థలం గుంటూరుజిల్లా అలవాల గ్రామం. అయితే ఎన్నో ఏళ్ళ క్రితం నుంచి వారి కుటుంబం నెల్లూరుజిల్లాలో స్థిర పడిపోయింది. సుబ్బయ్య-రామలక్ష్మమ్మ దంపతులకు 1929 డిసెంబర్ 27న జన్మించి ఎస్ఎల్ నరసింహంగా ప్రసిద్ధి చెందిన ఆయన విద్యాభ్యాసమంతా మొదట్లో వెంకటగిరి, ఆ తర్వాత విజయవాడ, గుంటూరుల్లో సాగింది. స్వతహాగా అందగాడు. గాయకుడు. మంచి వాక్చాతుర్యం ఆయన సొంతం. నటనలోనూ.. డైలాగ్‌లు చెప్పడంలోనూ దిట్ట. చదువుకుంటూనే నాటకరంగంపై ఆసక్తితో 1950 ప్రాంతాల్లో గుంటూరు హిందూ కళాశాలలో ఎదురీత నాటకంలో 'కుసుమకుమారి' అనే స్త్రీ పాత్రను అద్వితీయంగా పోషించి కళాశాల నాటకపోటీల్లో 'ఉత్తమ నటి'గా బహుమతినందుకున్నారు. పలు నాటికలు, నాటకాల్లో ఆయన స్త్రీ పాత్రలతో బాగా రాణించారు. పురుషపాత్రల్లోనూ పాత్రోచితంగా నటించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఎన్నో పరిషత్తుల్లో బహుమతులు సాధించారు. ఏకపాత్రాభినయాల్లోనూ లెక్కలేనన్ని బహుమతులు వచ్చాయి. ఆయన నటించిన పలు నాటికలు ఆలిండియా రేడియోలోనూ, దూరదర్శన్‌లోనూ ప్రసారమయ్యాయి. అనేక నాటక పరిషత్తులకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. 'వెంకటగిరి నట సమాఖ్య' వ్యవస్థాపక అధ్యక్షుడిగా నాటక రంగానికి ఎనలేని సేవ చేశారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ వారు అఖిలభారత స్థాయిలో నిర్వహించిన సంగీతపోటీల్లోనూ బహుమతులు వచ్చాయి. పలు సినిమాల్లోనూ ఆయన విశిష్టమైన పాత్రలు పోషించారు. ముత్యాల సుబ్బయ్య దర్శకత్వంలో వచ్చిన 'మామగారు' సినిమాలో దాసరి నారాయణరావు స్నేహితుని పాత్ర 'పోలయ్య'గా నటించి ప్రేక్షకుల ప్రశంసలందుకున్నారు. నాటకరంగంలో ఆయన సేవలకు ఎన్నో అవార్డులు లభించాయి. ఎంతో విశిష్టమైన రాయలసీమ రంగస్థలి అవార్డు, కళాంజలి ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ప్రఖ్యాత పాత్రికేయుడు, 'లాయర్' పత్రిక వ్యవస్థాపకుడు తుంగా రాజగోపాల రెడ్డి స్మారక రంగస్థల అవార్డు, రాష్ట్రప్రభుత్వం నుంచి ఉత్తమ నటునిగా అవార్డు వంటి ఘనమైన పురస్కారాలు ఆయనకు లభించాయి. ప్రత్యేకించి వెంకటగిరి రాజా, సంగీతగేయధార సృష్టికర్త, ప్రస్తుతం ఎస్‌విబిసి ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ విబి సాయికృష్ణ యాచేంద్ర రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల్లో నిర్వహించిన అనేక 'సంగీత గేయధార' కార్యక్రమాలకు ఎస్ఎల్ నరసింహం వ్యాఖ్యాతగా, సమన్వయకర్తగా ఉంటూ అందరి ప్రశంసలందుకున్నారు. షిరిడీ సాయిబాబా అంటే ఆయనకు పరమభక్తి. కొద్దికాలం క్రితం షిరిడీసాయిని స్తుతిస్తూ అత్యద్భుతమైన రీతిలో భక్తిగీతాలను రచించి రెండు ఆడియో సీడీలుగా విడుదల చేశారు. ఏదేమైనా.. ఆయన మృతితో నెల్లూరుజిల్లా నాటకరంగం ఒక మంచి నటుడిని కోల్పోయినట్లయింది. విబి సాయికృష్ణ యాచేంద్రతో పాటు అనేకమంది నాటక కళాకారులు, కళాభిమానులు ఎస్ఎల్ఎన్ మృతి బాధాకరమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ళతరబడి ఎంతో ఉత్సాహంతో నాటకరంగానికి ఎనలేని సేవలు చేసి అందరి అభిమానాన్ని పొందిన ఎస్ఎల్ నరసింహం లేని లోటు తీరనిది. ఆయన మృతికి విచారం తెలియజేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తోంది..'లాయర్'!.

## 'లాయర్' ఎంతో బాగుంది

ప్రతివారం 'లాయర్' పత్రిక చూస్తున్నాం. వార్తా కథనాలు, వివిధ సంఘటనలకు సంబంధించిన వార్తలు ఎంతో ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. ప్రత్యేకించి మొదటి పేజీ వార్తలు వాస్తవాలను ప్రతిబింబిస్తున్నాయి. రాజకీయ వార్తలు, ప్రత్యేక కథనాలు, శీర్షికల్లో వచ్చే వ్యాసాలు ముక్కుసూటిగా ఉంటూ నిష్పాక్షికతకు అద్దం పడుతున్నాయి. ఇదే విధంగా 'లాయర్' కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.

**కె.సీతాలత, వెంకటాచలం.**

## డెంగ్యూతో జాగ్రత్త

జిల్లాలో సాధారణంగా సెప్టెంబర్ నుండి డిసెంబర్ దాకా మారుతున్న వాతావరణంతో సీజనల్ వ్యాధులు బాగా ప్రబలుతున్న విషయం అందరికీ తెలిసిందే! ముఖ్యంగా వైరల్ జ్వరాలు చిన్నపిల్లలను పట్టి పీడిస్తుంటాయి. ఈ సీజన్‌లో డెంగ్యూ వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డులు కేటాయించి, చిన్నపిల్లలకు ఎలాంటి జబ్బులు జ్వరాలు వచ్చినా ప్రత్యేక చికిత్సలు చేసేందుకు వైద్యఆరోగ్య శాఖ సమాయత్తం కావాలి. ఈ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కలిగించేందుకు పెద్దఎత్తున సదస్సులు నిర్వహించాలి. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్యబృందాలను నియమించి, సీజనల్ వ్యాధులను నియంత్రించాలి.

**చంద్రశేఖరయ్య, చింతారెడ్డిపాళెం.**

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## బడులకి పోవాలంటేనే భయంగా ఉంది

బడుల్లో కూడా కరోనా రాకాసి విజృంభిస్తుండడంతో బడులకి వెళ్ళాలంటే పిల్లలకి, పంపాలంటే తల్లిదండ్రులకి ఎంతో భయంగా ఉంటోంది. చాలాకాలం తర్వాత మళ్ళీ బడులు తెరవడంతో సంతోషంగా పాఠశాలలకు వెళ్ళాల్సిన పిల్లల్లో మునుపటి ఉత్సాహం కనిపించడం లేదు. ముఖ్యంగా పొదలకూరు, వెంకటగిరి తదితర గ్రామాల్లో బడికి వెళ్తే కరోనా అంటుకుంటుందేమోనన్న భయాందోళన అందరిలోనూ కనిపిస్తోంది. పిల్లలకు, ఉపాధ్యాయులకు కూడా పలు పాఠశాలల్లో కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అవుతున్న నేపథ్యంలో అందరూ ఆందోళన చెందుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ బడులకు పంపుతున్నారే తప్ప ఎవరూ మనశ్శాంతితో ఉండడం లేదు. అనేక పాఠశాలలు కోవిడ్ రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసి ప్రతి పాఠశాలలోనూ కరోనా నిబంధనలు గట్టిగా అమలయ్యేలా చూడాలని ప్రార్థన.

**ఆర్‌పి రాధారాణి, వెంకటగిరి రూరల్.**

# సామాజిక సంస్కరణాభిలాషి.. శ్రీ భగవద్రామానుజులు

## - ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



భగవద్రామానుజుల వారు ఆధ్యాత్మిక వేత్తే కాక సామాజిక సంస్కరణాభిలాషి అని, ఆయనెంతో ఆదర్శప్రాయులని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొనియాడారు. సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపి. సమానత్వ సాధన కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఈనెల 14న చిన్న జీయర్‌స్వామివారు ఢిల్లీలోని ఉప రాష్ట్రపతి నివాసానికి వెళ్ళి హైదరాబాద్ ముచ్చింతల్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎంతో వైభవంగా జరుగనున్న భగవద్రామానుజుల విగ్రహావిష్కరణకు ఉప రాష్ట్రపతి దంపతులను ఆహ్వానించారు. 216 అడుగుల ఎత్తుగల భగవద్రామానుజుల విగ్రహం (సమతా విగ్రహం) ఆవిష్కరణోత్సవం గురించి ఆయన ఉప రాష్ట్రపతికి తెలియజేశారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ భగవద్రామానుజుల విశిష్టతను ప్రశంసించారు. సామాజిక సంస్కరణాభిలాషిగా భగవద్రామానుజులు సమాజంపై చెరగని ముద్ర వేశారని, సమాజంలో నెలకొన్న వివక్షకు వ్యతిరేకంగా వెయ్యేళ్ళ క్రిందటే ఉద్యమించిన సామాజిక చైతన్యప్రబోధకులుగా ఆయన వినుతికెక్కారని అన్నారు. భగవద్రామానుజుల వారి అతిపెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా వారి బోధనలు, సందేశం, ప్రపంచవ్యాప్తంగా విస్తరించేందుకు అవకాశం ఉంటుందని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# జిల్లాలో కేంద్ర జల్‌శక్తి బృందం



జిల్లాలోని సంగం, పెన్నా బ్యారేజీలు, పెన్నా వారధితో పాటు సోమశిల జలాశయం స్థితిగతులెలా ఉన్నాయో తెలుసుకునేందుకు ఈ నెల 14న కేంద్ర జల్‌శక్తి బృందం జిల్లాకు వచ్చింది. సోమశిల జలాశయం క్రస్ట్‌గేట్లు ఎలా ఉన్నాయి?.. మట్టి కట్టడాల పరిస్థితేమిటి?.. ఆప్రాన్, హెడ్ రెగ్యులేటర్‌ల స్థితిగతులన్నిటినీ ఈ బృందం నిశితంగా పరిశీలించింది. సోమశిల-కండలేరు వరద కాలువలను చూసి వాటి వివరాలు తెలుసుకున్నారు. కేంద్ర జలశక్తి విభాగం రీజనల్ డైరెక్టర్ దేవేందర్‌రావు ఈ జలాశయానికి సంబంధించిన అన్ని విషయాలను తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ హరి నారాయణరెడ్డి, సోమశిల సూపరింటెండింగ్ ఇంజనీర్ వెంకటరమణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జిల్లాలో నిర్మాణంలో ఉన్న సంగం బ్యారేజీ, పెన్నాబ్యారేజీలను కూడా సందర్శించి వాటి పరిస్థితిని పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం అందించే జల్‌శక్తి పురస్కారాల కోసం రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులను పరిశీలిస్తున్నట్లు ఈ సందర్భంగా దేవేందర్‌రావు తెలిపారు. ప్రాజెక్టుల వారీగా ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఆరవ స్థానంలో ఉందని, మూడో నేషనల్ వాటర్ అవార్డు-2020ని ప్రకటించేందుకు మైనర్, మేజర్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్నామని ఆ బృందం పేర్కొంది.

# విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయం

## - ఎన్‌బికెఆర్ ఇంజనీర్స్ డేలో డా.విజయకుమార్‌రెడ్డి



భారతరత్న, ఇంజనీరింగ్ పితామహుడు డా.మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శప్రాయుడని, ఇంజనీరింగ్‌లో భారత ఖ్యాతిని అంతర్జాతీయస్థాయిలో సగర్వంగా చాటిన మహనీయుడని ఎన్‌బికెఆర్ కళాశాల డైరెక్టర్ డా.విజయకుమార్‌రెడ్డి కొనియాడారు. డా. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఈనెల 15న విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన ఆ మహనీయుని సేవలను విద్యార్థులకు వివరించి వారిలో స్ఫూర్తిని కలిగించారు. కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. డి.శ్రీనివాస్ మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ పరిజ్ఞానం అద్వితీయమని, ఆయన ప్రతిభాపాటవాలు జాతీయ స్థాయిలోనే కాక, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచాయని ప్రశంసించారు. భారతీయ ఇంజనీరింగ్ పితామహుడిగా, భారతరత్నగా ఆ మహనీయుని సేవలు ఏనాటికీ మరచిపోలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అందరికీ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.



# నీటి పారుదల ప్రాజెక్టులపై మంత్రి అనిల్ సమీక్ష

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్ ఈ నెల 15న జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టుల ప్రగతిపై అధికారులతో సమీక్షించారు. నెల్లూరు నగరంలోని ఇస్కాన్ సిటీలోని తన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ ఎస్.ఈ., తెలుగుగంగ ఎస్.ఈ., సోమశిల ఎస్.ఈ., ఇతర అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించి, జిల్లాలోని ప్రాజెక్టుల స్థితిగతులను తెలుసుకున్నారు. త్వరలో పెన్నా బ్యారేజీ, సంగం బ్యారేజీ పనులను పూర్తి చేయాలని అధికారులకు మంత్రి అనిల్ ఈ సందర్భంగా సూచించారు.

# ఇంజనీర్లకు ఆదర్శం మోక్షగుండం

'భారతరత్న', ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీర్లందరికీ ఆదర్శనీయమని జేసీ రోజ్‌మాండ్, జడ్పీ సిఇఓ సుశీల, డిపిఓ ధనలక్ష్మిలతో పాటు పలువురు ఇంజనీరింగ్ అధికారులు కొనియాడారు. ఈ నెల 15న ఆ మహనీయుని జయంతి సందర్భంగా నెల్లూరు, జడ్పీ మీటింగ్ హాల్లో జిల్లా అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


21వ వర్ధంతి



కీ॥శే॥ శ్రీ జక్కా రంగారెడ్డి

(మరణం - 18.09.2000)

మహనీయుని దివ్యస్మృతికి మా భాష్పాంజలి

భార్య : జక్కా కామేశ్వరమ్మ

కుమారులు

జక్కా కోదండరామిరెడ్డి

జక్కా శ్రీనివాసులురెడ్డి

జక్కా శివనారాయణరెడ్డి

మరియు కుటుంబసభ్యులు



## ఇదే స్ఫూర్తిని కొనసాగించాలి

### - అధికారులతో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు

జిల్లాలో అధికారులందరి సహకారంతో దేశస్థాయిలో పథకాల అమలులో జిల్లాకు రెండు పురస్కారాలు లభించాయని, జిల్లా అధికారులు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు అన్నారు. ఈనెల 13న కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్పందన అర్జీల పరిష్కారానికి కృషిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా కోర్టు కేసుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కోర్టు కేసుల పరిశీలన విధి నిర్వహణలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీలు హరేందిరప్రసాద్, గణేష్‌కుమార్, విదేహ్ ఖరే, ఆర్‌డిఓ చినఓబులేసు, డిఆర్‌డిఏ, డ్వామా పీడీలు సాంబశివరావు, తిరుపతయ్య, డిపిఓ ధనలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ రోజ్‌మాండ్, డిఇఓ రమేష్, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ ఆనందకుమారి, ట్రైనీ కలెక్టర్ ఫర్హాన్ అహ్మద్, పంచాయతిరాజ్ ఎస్ఇ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### ఉప సర్పంచ్‌లకు 4 విడతల శిక్షణ

జిల్లాలో కొత్తగా ఎన్నికైన గ్రామపంచాయతీల ఉప సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు ఈనెల 17 నుంచి అక్టోబర్ 12వ తేది వరకు నాలుగు విడతల్లో శిక్షణ ఇస్తామని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 46 మండలాలకు సంబంధించి మూడు విడతల్లో 12 మండలాల వంతున, నాలుగో విడతలో 10 మండలాలకు శిక్షణ ఏర్పాట్లు ఖరారుచేశామన్నారు. తొలివిడత శిక్షణ ఈనెల 17 నుంచి 23 దాకా జరుగుతుందన్నారు. కలిగిరి, వెంకటాచలం, సైదాపురం, వరికుంటపాడు, కొడవలూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, చేజర్ల, చిల్లకూరు, ఓజిలి, మర్రిపాడు, దొరవారి సత్రం మండలాల వారికి తొలివిడత శిక్షణ ఉంటుందని, కోవిడ్ నిబంధనలను అనుసరించి మండల కేంద్రాల్లో శిక్షణఉంటుందని వివరించారు.

## ఇరిగేంద్రబాబు సేవలకు గుర్తింపు



నెల్లూరులోని సంతపేటలో బిజెపి నాయకునిగా పెరుగుదురు ఇరిగేంద్రబాబు చేస్తున్న సేవలను పార్టీ గుర్తించి ఆయన్ను సంతపేట శాఖ బిజెపి అధ్యక్షునిగా నియమించింది. బిజెపి జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్ ఆ మేరకు ఇటీవల ఇరిగేంద్ర నియామకాన్ని ఖరారు చేశారు.

## ప్రథమ చికిత్స పట్ల అవగాహన అవసరం

### - శిక్షణ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి



రోగికి లేదా బాధితునికి వెంటనే ప్రథమ చికిత్సను అందించేందుకు ప్రతిఒక్కరూ తగు అవగాహనతో ఉండాలని రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రెడ్‌క్రాస్ ఆవరణంలో ప్రథమ చికిత్స-అవగాహనపై మూడురోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమం ఈనెల 11న ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసరమైన సమయంలో ప్రాథమిక చికిత్స ఎంతో అవసరమన్నారు. జిల్లా రెడ్‌క్రాస్, సెయింట్‌జాన్ అంబులెన్స్- న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది. అనంతరం శిక్షణ పొందిన ఔత్సాహికులకు సర్టిఫికెట్లను అందజేశారు. రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మన్ సుధీర్‌నాయుడు, కమిటీ సభ్యులు రవిప్రకాష్, సురేష్, ప్రసన్నాంజనేయులు, సమన్వయకర్త రవికుమార్, కార్యదర్శి మస్తానయ్య పాల్గొన్నారు.

## సచివాలయానికి సీలింగ్ ఫ్యాన్ల వితరణ

నెల్లూరు నగరంలోని 21వ డివిజన్‌లో ఉన్న సచివాలయానికి వైకాపా నెల్లూరు పార్లమెంటరీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరి ఈనెల 14న సీలింగ్ ఫ్యాన్లను వితరణగా అందజేశారు. వైకాపా 21వ డివిజన్ ఇన్‌ఛార్జి మొయిళ్ళ సురేష్‌రెడ్డి, నాయకులు పెంచల నరసారెడ్డి, రాజారెడ్డి, వెంగళ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు



## రైల్వే ప్రయాణీకులకు మెరుగైన సేవలందించాలి

### ప్యాసింజర్స్ సర్వీసస్ కమిటీ ఛైర్మన్

రైల్వే ప్రయాణీకులకు మెరుగైన సేవలందించేందుకు చర్యలు చేపట్టాలని పాసింజర్స్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ రమేష్‌చంద్ర రతన్ చెప్పారు. నెల్లూరులో ఆయన మాట్లాడుతూ, ఈ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 14న నెల్లూరు, గూడూరు రైల్వేస్టేషన్లను పరిశీలించి ప్రయాణీకులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నామన్నారు. ప్రయాణీకులకు అన్ని రైల్వే స్టేషన్‌లలో కనీస వసతి, సదుపాయాలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. తాము గుర్తించిన సమస్యలను రైల్వే బోర్డుకు వివరిస్తామని, ప్రయాణీకుల సమస్యలు తీర్చేవిధంగా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శివరాజ్, ప్రణబ్ భూషణ్, ప్రదీప్‌కుమార్, బబిత, పలువురు అధికారులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధుల పట్ల

## అప్రమత్తంగా ఉండాలి

### - కమిషనర్ దినేష్‌కుమార్



వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు నగర కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఈనెల 14న ఆయన సచివాలయ కార్యదర్శులు, శానిటరీ అధికారులతో సమావేశం నిర్వహించి వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. సీజనల్ వ్యాధులను నిరోధించేందుకు ప్రతి శుక్రవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నామని ఆయన చెప్పారు. ఇళ్ల వద్ద సైడుకాలువల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఆయిల్‌బాల్స్ వేసి దోమల లార్వాలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని, రోడ్లపై చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధతో శుభ్రం చేస్తుండాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణను మరింత క్రమబద్ధంగా పూర్తిస్థాయిలో చేపట్టనున్నామని, రీసైక్లింగ్ ద్వారా చెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియను అక్టోబర్ 2వ తేదీన ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్



ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 2.0 కార్యక్రమం ఇటీవల నెల్లూరు, ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగింది. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర వైస్ ఛైర్మన్ ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి రన్‌ను ప్రారంభించారు. విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యూత్ రెడ్‌క్రాస్, జూనియర్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు రన్‌లో పాల్గొన్నారు. కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల, జగన్స్ డిగ్రీ కాలేజీ, డికె గవర్నమెంట్ మహిళా జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. పాల్గొన్న వాలంటీర్లకు విఎస్‌యు రిజిస్ట్రార్ డా.ఎల్ విజయకృష్ణారెడ్డి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజనాధికారి డా. ఆకుల మహేంద్రరెడ్డి, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డా. ఉదయ్‌శంకర్ అల్లం, ప్రోగ్రాం ఆఫీసర్ నాహిద్, ప్రసాద్, ఎన్ఎస్ఎస్ సిబ్బంది ఉస్మాన్ అలీ పాల్గొన్నారు.



## ఉపముఖ్యమంత్రిని కలిసిన కలెక్టర్, ఎమ్మెల్సీ కళ్యాణ్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్‌ను జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఈ నెల 13న ఆర్ అండ్ బి అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ హరేందిరప్రసాద్, ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ పాల్గొన్నారు.

## విపిఆర్ విద్యలో.. 'హిందీ దివస్'



నెల్లూరులోని విపిఆర్ విద్యలో ఈనెల 14న హిందీ దివస్ వేడుకలు ఘనంగా జరిగాయి. విపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈ సందర్భంగా విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొఫెసర్ వి.నారాయణరెడ్డి బహుమతులు అందజేసి మాట్లాడుతూ 1949 సెప్టెంబరు 14న హిందీని జాతీయభాషగా గుర్తించి హిందీకి మనదేశం గొప్ప హోదాను కల్పించిందని, స్వాతంత్ర్యోద్యమం బాగా ఊపందుకోవడానికి హిందీ ముఖ్యపాత్ర పోషించిందని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విపిఆర్ విద్య ప్రిన్సిపాల్ వి.టి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ఆర్‌హెచ్ కళ, హిందీ ఉపాధ్యాయురాలు షేక్ హాజీరాతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులందరూ ఈ కార్యక్రమంలో కోవిడ్ నిబంధనలకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటూ పాల్గొన్నారు.

### ఏపిఈఏపి ఫలితాల్లో..

## విశ్వసాయి విజయకేతనం



అర్జున్



హారిణి



మౌనిక

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14న విడుదల చేసిన ఏపి ఈఏపి (అగ్రికల్చర్, బీ - ఫార్మసీ ఫలితాల్లో నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఈ కళాశాలకు చెందిన భానుప్రకాష్ 253వ ర్యాంకు, అర్జున్ 282, హరిణి 360, మౌనిక 375, జ్యోతి 672, రాధాకృష్ణ 751, శ్రీకుమార్ 780, శ్రీదీపిక 919, విజయ్‌కృష్ణ 1047వ ర్యాంకులను సాధించారని కళాశాల ఛైర్మన్ డా.ఎన్ సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ కృష్ణమోహన్‌లు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులందరినీ వారు ఈనెల 14న కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

## శ్రీ సిద్ధివిఘ్నేశ్వరుని కల్యాణోత్సవం

నెల్లూరు పప్పులవీధిలో ఉన్న శ్రీ సిద్ధివిఘ్నేశ్వరాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 14న స్వామివారి కల్యాణోత్సవాన్ని నయనానందకరంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి శోభాయమానంగా లక్ష్మీగణపతి అలంకారం చేసి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మాచవోలు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో సిద్ధివిఘ్నేశ్వరునికి శాస్త్రోక్తంగా అభిషేకాలు, పూజలు జరిగాయి. అనంతరం రాత్రి నగరోత్సవం నిర్వహించారు. పప్పులవీధిలోని పాండురంగ అన్నదాన సమాజం కమిటీ ఈ వేడుకలను పర్యవేక్షించగా, పాదర్తి కృష్ణారావు-లక్ష్మి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కోవిడ్ నిబంధనలను అనుసరిస్తూ ఈ వేడుకలు జరిగాయి.

# 29, 30 తేదీల్లో వెంకటగిరి జాతర



కోవిడ్ నేపథ్యంలో వెంకటగిరి పోలేరమ్మ అమ్మవారి జాతరను ప్రభుత్వ నిబంధనలను అనుసరించి సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈనెల 29,30 తేదీల్లో వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ అమ్మవారి జాతర జరగనున్న నేపథ్యంలో ఆయన ఆ ఏర్పాట్ల గురించి ఈనెల 15న అధికారులతో ఏర్పాటుచేసిన సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాజాగారి కోటలో అమ్మవారి సేవకులకు వెంకటగిరి సంస్థానాధీశులు సంప్రదాయబద్ధంగా తాంబూలం అందించి జాతర కార్యక్రమాలను ప్రారంభించారని, వారి ఆలోచనలకు అనుగుణంగా అమ్మవారికి శాస్త్రోక్తంగా జాతరను నిర్వహించాలన్నారు. వెంకటగిరి మునిసిపల్ ఛైర్మెన్ తదితరుల పర్యవేక్షణలో జాతరను విజయవంతం చేయాలని కోరారు. దేవస్థానం అధికారులు నూతన ధర్మకర్తల మండలి సూచనలను పరిగణనలోకి తీసుకుని మునిసిపాలిటీ, రెవెన్యూ, పోలీసు అధికారులు తగు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఆర్టీసి అధికారులు భక్తులకు బస్సు సౌకర్యాలు కల్పించాలని, భక్తులందరి సహకారంతో అమ్మవారికి విద్యుత్ దీపాలంకరణలు, పూల అలంకరణలు వగైరాలన్నీ చేద్దామని అన్నారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన కార్యక్రమం ఏర్పాటుచేసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా భక్తులందరూ తిలకించే విధంగా ఏర్పాట్లు చేద్దామని ఆయన సూచించారు. వచ్చే ఏడాది జాతర లోపు బంగారు కిరీటం, బంగారు శూలంతో సహా ఆభరణాలన్నీ సమకూర్చి అమ్మవారిని శోభాయమానంగా అలంకరిస్తామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో దేవస్థానం అధికారులు, ధరకర్తల మండలి, అధికారులు పాల్గొన్నారు.

# లక్ష్మీనృసింహునికి విశేష పూజలు



పెంచలకోన క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఈనెల 11న స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా విశేష పుష్పాలంకరణలతో పూజలు జరిగాయి. తొలుత వేకువ నుంచి స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పూలంగిసేవ, ఆ తర్వాత స్వామివారి నిత్యకల్యాణ మండపంలో శాంతిహోమం చేపట్టారు. ఉదయం కల్యాణోత్సవం, రాత్రి బంగారు గరుడవాహనోత్సవం ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాద్‌ను ఈ నెల 14వ తేదీ అమరావతిలో గౌరవపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించిన డిసిఎమ్ఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, పక్కన కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి.

# గురువులకు గౌరవ సన్మానాలు



నెల్లూరులోని రోటరీ ఆడిటోరియంలో ఈనెల 14న జిల్లాలోని పలు ప్రాంతాల్లో విశిష్టసేవలందించిన పలువురు ఉపాధ్యాయులకు ఘన సన్మానాలు నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించి గౌరవించారు. విశ్రాంత ఉపాధ్యాయులు గురునాథరావు (నెల్లూరు), నారాయణరావు(చీపినాపి), ప్రసాద్‌రావు(పాతవెల్లంటి), ప్రసాద్ (గుర్రం కొండ), ప్రసాద్ (రాపూరు), పసుపులేటి పెంచలయ్య (కుల్లూరు) ఈ సన్మానాలందుకున్న వారిలో ఉన్నారు. రోటరీ క్లబ్ నెల్లూరు అధ్యక్ష కార్యదర్శులు విశ్వం, ముస్తాక్‌అహ్మద్, రోటరీ గవర్నర్ భరత్‌కుమార్‌రెడ్డి, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, రాఘవేంద్రశెట్టి పాల్గొన్నారు.

# సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి

## - పెంచలకోన కొత్త పాలకవర్గం ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యే ఆనం





దైవదర్శనం కోసం ఆలయానికి వచ్చే సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. ఈనెల 11న పెంచలకోన పుణ్యక్షేత్రానికి కొత్త పాలక మండలి ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. ఎమ్మెల్యే ఆనం మాట్లాడుతూ ఎంతెంతో దూరప్రాంతాల నుంచి భక్తులు ఈ ఆలయానికి వస్తుంటారని, పాలకమండలి వారు వారికి ప్రాముఖ్యతనిచ్చి వారికెలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పాలకవర్గంలో చోటు దొరకడం అదృష్టంగా భావించి పాలకమండలి వారు అంకితభావంతో పనిచేయాలన్నారు. ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు అందరూ కృషిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆలయ ఇ.ఓ వెంకటసుబ్బయ్య కొత్తపాలకమండలి సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఆ తర్వాత సభ్యులంతా కలసి చెన్ను తిరుపాల్‌రెడ్డిని ఆలయ ఛైర్మెన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైకాపా నాయకులు చెన్ను బాలకృష్ణారెడ్డి, బత్తిన పట్టాభిరామిరెడ్డి, వెంకటగిరి మునిసిపల్ ఛైర్మెన్ భానుప్రియ, కలువాయి మాజీ జడ్పీటిసి సభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డి, డిసిసిబి మాజీ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉదయగిరిలో నకిలీ చలానాల కలకలం

- బట్టబయలవుతున్న అవినీతి భాగోతం
- రిజిస్ట్రేషన్ శాఖలో కలవరం

రిజిస్ట్రేషన్‌శాఖలో నకిలీ చలానాల కుంభకోణం సర్వత్రా చర్చనీయాంశంగా ఉంది. ఇటీవల నాయుడుపేటలో ఈ అవినీతి బాగోతం బయటపడగా, తాజాగా ఉదయగిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ ఇదే తరహా కుంభకోణం ఈనెల 14న వెలుగులోకి రావడంతో ఆ శాఖ సిబ్బందిలో కలకలం ప్రారంభమైంది. గత నెలలో నాయుడుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ నకిలీ వ్యవహారం బయటపడడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 19 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోను ఉన్నతాధికారులు పెద్దఎత్తున తనిఖీలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉదయగిరిలో డాక్యుమెంట్ల తనిఖీల్లో నకిలీ చలానాలను అధికారులు గుర్తించారు. ఇందులో పలువురు డాక్యుమెంట్ రైటర్ల ప్రమేయం ఉన్నట్లుగా నిర్ధారించారు. ఇంకా ఎవరెవరి పాత్ర ఇందులో ఉందో ఆరాతీస్తున్నారు. దాదాపు 50 డాక్యుమెంట్లకు సంబంధించి సుమారు 8 లక్షల రూపాయల దాకా నకిలీ చలానాలతో రిజిస్ట్రేషన్లు చేయించినట్లుగా సమాచారం. ఈ వ్యవహారంపై సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఈ వ్యవహారం గుట్టుమట్టులన్నిటినీ ఆరాతీస్తున్నారు. రేపోమాపో ఈ విషయంపై పూర్తి వివరాలు బట్టబయలయ్యే అవకాశం ఉంది. జిల్లాలోని ఇంకా కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇలాంటి నకిలీ వ్యవహారాలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అవినీతి వ్యవహారాలను ఆడిట్ అధికారులు గుర్తించినప్పటికీ సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లోతుగా తనిఖీలు చేస్తే తప్ప ఇలాంటి లోగుట్టులు బయటపడే అవకాశం లేదని ప్రజలు భావిస్తున్నారు.

# సిపిఎం నిరసన

పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దుచేయాలంటూ సిపిఎం నెల్లూరు నగర శాఖ ఆధ్వర్యంలో ఇటీవల ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేస్తూ నగరంలో ర్యాలీ చేపట్టారు. విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై అదనపు భారం వేయడం సముచితం కాదన్నారు. సిపిఎం నాయకులు మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, శ్రీనివాసులు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ వైఎస్సార్ పింఛన్ కానుక

## - జడ్పీ సిఇఓ సుశీల

జిల్లాలోని అర్హులందరికీ వైఎస్సార్ పింఛన్ కానుక అందేలా చర్యలు తీసుకోవాలని జడ్పీ సిఇఓ సుశీల సంబంధిత అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని జడ్పీ కార్యాలయం నుంచి ఆమె ఈనెల 14న టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఎంపిడిఓలతో మాట్లాడారు. ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించి అర్హులందరికీ సత్వరం పింఛన్లు మంజూరు చేయాలని చెప్పారు. గ్రామ వలంటీర్లు సర్వే చేసి ఆ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

# జ్వరాలు పెరుగుతున్నాయి.. జాగ్రత్త

## డిఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి


జిల్లాలో అక్కడక్కడా జ్వరాలు పెరుగుతున్నాయని, టైఫాయిడ్ కేసులు కూడా నమోదవుతున్నాయని, వైద్యాధికారులు సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండి వ్యాధిగ్రస్తులకు వెంటనే చికిత్సలందించాలని డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి ఆదేశించారు. ఈనెల 14న నెల్లూరులోని తమ కార్యాలయం నుంచి ఆమె మలేరియా సబ్‌యూనిట్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ జిల్లాలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులను నిరోధించేందుకు అన్నివిధాల కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియ నివారణ అధికారి మనోరమ పాల్గొన్నారు.






# టీడీపీ గ్రాఫ్ పైకా... కిందికా!?

**2019** ఎన్నికల్లో కుదేలైపోయి... రాష్ట్రాధికారాన్ని వైసీపీకి అప్పగించేసిన తరువాత టీడీపీ మళ్లీ ఇప్పుడు కోలుకుంటున్నది. కాలూ, చెయ్యీ కూడదీసుకుంటున్నది. నోరు పెగులుతున్నది. నారా లోకేష్‌ను ముందుపెట్టి, చంద్రబాబునాయుడు వెనుక నుంచి చక్రం తిప్పుతున్నారు. డ్రైవింగ్ స్కూల్ వారు స్టీరింగ్ చక్రం ముందు మనల్ని కూర్చోబెట్టి, లీవర్స్ వారి చేతిలో పెట్టుకుని, మనకు డ్రైవింగ్ నేర్పిస్తారు. కారును మనమే నడుపుతున్న అనుభూతికి లోనవుతుంటాము. అలా, టీడీపీ డ్రైవింగ్ సీట్లో లోకేష్‌ను కూర్చోబెట్టి... లీవర్స్ అన్నీ చంద్రబాబు పట్టుకుని, టీడీపీ సైకిల్‌ను నడిపిస్తున్నారు. తప్పు ఏమీ లేదు. తప్పు పట్టవలసింది కూడా ఏమీ లేదు. టీడీపీ శ్రేణులు సైతం లోకేష్‌ను ముందుపెట్టుకుని వైసీపీపై యుద్ధానికి బయలుదేరుతున్నాయి. రాష్ట్రంలో ఎవరికి ఏ రకమైన ఇబ్బంది కలిగినా... లోకేష్ బయలుదేరుతున్నారు.. వారిని పరామర్శించడానికి. ఇందులోనూ తప్పు పట్టవలసింది ఏమీ లేదు. ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ విధుల్లో అది కూడా ఒకటి. బాధితుల్ని పరామర్శించడం... వారికి న్యాయం జరిగేవరకు నిద్రపోము అని చెప్పడం సహజం. ఈ ప్రతిపక్ష 'పోరాటానికి' వెనుకనుంచి మద్దతు ఇచ్చే న్యూస్ చానెల్స్ ఇస్తున్నాయి. వీటన్నింటి వల్ల, టీడీపీ బాగా పుంజుకున్నదనే భావం వ్యాపింప చేయడానికి రాష్ట్రంలో గట్టి ప్రయత్నం జరుగుతోంది.






నిజంగానే టీడీపీ పుంజుకుందా? ఇంకో రెండు...రెండున్నర ఏళ్లలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీని సవాలు చేసే స్థితికి టీడీపీ సమాయత్తం అవుతున్నదా?

ఓటర్లలో 99 శాతం మంది సైలెంట్ ఓటర్లు. వారు మాట్లాడరు. పేపర్ చదవరు. టీవీల్లో డిబేట్స్ చూడరు. వాదోపవాదాల్లో తలదూర్చరు. దేనికీ రియాక్ట్ అవ్వరు. పోలింగ్ సమయంలో మాత్రం కామ్‌గా... సైలెంట్‌గా... పోలింగ్ బూత్‌కు వెళ్లి, ఓటు వేసేసి ఇంటికెళ్లిపోతారు.

ఆ మిగిలిన ఒక్క శాతం మందే.... పేపర్లు చదువుతారు. టీవీ డిబేట్లు చూస్తారు. బల్లలు గుద్ది వాదిస్తారు. ప్రభుత్వ మంచి చెడ్డలపై గొంతులు చించుకుంటారు. ప్రభుత్వ తీరు తెన్నులపై తీవ్రంగా స్పందిస్తారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడతారు. అల్లరల్లరి చేస్తారు. మైలేజ్ 'సూపర్' అనుకుంటారు. టీడీపీ ఈ ఒక్క శాతం మంది 'ఒపీనియన్ మేకర్స్'పై ఆధార పడుతున్నట్టు కనపడుతున్నది.

వైసీపీ మాత్రం ఈ ఒక్క శాతం 'ఒపీనియన్ మేకర్స్'ను పూర్తిగా వదిలేసి, మిగిలిన 99 శాతం మంది 'సైలెంట్ ఓటర్స్'పై ఆధారపడుతుంది. అందుకే టీవీ డిబేట్స్‌ను, పేపర్స్‌ను, విమర్శకులను, ధర్నాలను, చంద్రబాబునాయుడులను, నారా లోకేష్‌లను, సీపీఐ రామకృష్ణలను పట్టించుకోవడం మానేసింది.

ఆ 99 శాతం మందిలో నిరుపేదలు ఉన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని బడుగులు ఉన్నారు. పూట గడవని గ్రామీణులున్నారు. నోరూ... వాయి లేని అభాగ్యులున్నారు. ఏదో ఒక పథకం పేరుతో జగన్ ప్రభుత్వం బ్యాంక్ ఖాతాలలో జమ చేసే నగదుతో తాత్కాలికంగా అయినా సేద తీరుతున్నారు. 'జయహో...జగన్' అంటున్నారు. వారే వైసీపీకి శ్రీరామ రక్ష.

వారిని టీడీపీ చేరుకుంటున్నదా? వైసీపీ వల్ల రాష్ట్రానికి నష్టం జరుగుతున్నదని చెబుతున్నదా? వైసీపీ కంటే టీడీపీ ఏ విధంగా మంచిదో వివరిస్తున్నదా? టీడీపీకి ఓట్ వేస్తే ముఖ్యమంత్రి ఎవరో చెబుతున్నదా? ఇటువంటివే సవాలక్ష ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా... టీడీపీ పుంజుకుంది... పుంజుకుంది అనే ప్రచారం వల్ల టీడీపీకి వచ్చే లాభం గానీ, వైసీపీకి వచ్చే నష్టం గానీ కనపడడం లేదు... ఓ పది, పదిహేను పైసలు అటు ఇటు తప్పించి. నిజానికి, వైసీపీ గ్రాఫ్ కొంత తగ్గింది అనడంలో అనుమానం లేదు. కానీ, ఆ మేరకు టీడీపీ గ్రాఫ్ పెరగలేదు అని టీడీపీ నాయకులు కొందరు అభిప్రాయపడుతున్నారు కూడా.

రాజమండ్రి రూరల్ నుంచి టీడీపీ ఎం.ఎల్.ఏగా ఉన్న బుచ్చయ్య చౌదరి కూడా అదే భయంతో రాజకీయాలకు స్వస్తి చెబుదామనుకున్నారు. ఇప్పుడు నడుస్తున్న పద్ధతుల్లో పార్టీ నడిస్తే, 2024 ఎన్నికల్లో పార్టీ సత్ఫలితాలు సాధించలేదని ఆయన బలంగా నమ్ముతున్నారు. పార్టీ ఇంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ, చంద్రబాబునాయుడు వ్యవహారశైలి వీసమెత్తు మారలేదన్నది ఆయన అభిప్రాయం. 'ఆత్మ స్తుతి – పరనింద'తో పని జరగదు. 'ఎందుకని' అనే విషయాన్ని టీడీపీ అధ్యయనం చేసుకోవాలి. వైసీపీ కారెక్టర్‌ను విశ్లేషించుకోవాలి. అర్థం చేసుకోవాలి. తగిన విరుగుడు చర్యలు చేపట్టాలి. వైసీపీపైనా, ప్రభుత్వంపైనా టీడీపీ నేతల విమర్శల తీరు చూస్తుంటే.. 'పాత చింతకాయ' పద్ధతుల్లోనే ఆ పార్టీ రాజకీయం కొనసాగుతున్నట్టు కనబడుతున్నది. ఒక్క ముక్కలో చెప్పాలి అంటే... వైసీపీది కొత్త రాజకీయం – టీడీపీది పాత విమర్శల సరళి. నిజానికి, జగన్ బెయిల్ రద్దు చేయాలని కోరుతూ రఘురామ రాజు దాఖలు చేసిన పిటిషన్‌పై టీడీపీ ఆశలు పెట్టుకున్నట్టు కనపడుతున్నది. బెయిల్ రద్దు అయ్యి, జగన్ జైల్‌కు వెడితే, రాజకీయ చక్రం తిప్పడం బాగా సులువవుతుందనే భావం టీడీపీ వర్గాల్లో కనిపించింది. మూడు నాలుగు ముక్కలుగా వైసీపీ చీలిపోతుందని, దీంతో ఆ పార్టీని తేలికగా హ్యాండిల్ చేయవచ్చునన్న ఆశావహులు కూడా టీడీపీలో లేకపోలేదు. నిజానికి, బెయిల్ రద్దు అనేది మూడంచెల పోరాటం. మొదటి అంచెలో జగన్ గెలిచారు.

ఎన్నికలకు ఇంకా రెండున్నర సంవత్సరాలకుపైగా సమయం ఉంది. వైసీపీ గ్రాఫ్ తగ్గినట్టు కనబడుతున్నది గానీ... తగ్గిందో లేదో తెలుసుకునే మార్గం అయితే లేదు. 'ఫాల్స్ ప్రెస్టిజ్'ను పక్కనబెట్టి, తమ గ్రాఫ్ ఎందుకు పెరగడం లేదో టీడీపీ నేతలు నిజాయతీగా అధ్యయనం చేసుకుని, అడుగు ముందుకు వేయకపోతే....!

చెప్పేదేముంది?

**– భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

## గూడూరు డివిజన్ వార్తలు





### స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్‌పర్సన్‌గా
# బాధ్యతలు చేపట్టిన దేవసేనమ్మ

గూడూరు పురపాలక సంఘం మాజీ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్‌పర్సన్‌గా నియమితులైన విషయం విదితమే! ఈ నేపథ్యంలో విజయవాడలోని స్వచ్ఛాంధ్ర సంస్థ కార్యాలయంలో ఈ నెల 13న ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా సంస్థ కార్యాలయం వద్ద ఎం.డి సంపత్‌కుమార్, ఎస్.ఈ ఆనంద్, సిబ్బంది దేవసేనమ్మకు ఘనస్వాగతం పలికారు. కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం దేవసేనమ్మ–శివకుమార్‌రెడ్డిలను ఎమ్మెల్యే వరప్రసాద్‌తో పాటు నాయకులు, అభిమానులు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పొనకా దేవసేనమ్మ మాట్లాడుతూ స్వచ్ఛత, ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని ఉంచాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని, వారి కలను సాకారం చేసేందుకు తామందరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. స్వచ్ఛాంధ్ర కోసం ప్రజలు కూడా సహకరించాలని పిలుపునిచ్చారు. వచ్చేనెల రెండో తేదీన క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నారని, చెత్తబుట్టలు, వాహనాలు వంటివాటిని కేటాయించడం జరుగుతుందని తెలిపారు. పదవి అలంకారంగా తాము తీసుకోబోమని, తప్పనిసరిగా పనిచేసి చూపిస్తామని దేవసేనమ్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు పొనకా దివ్య తేజారెడ్డి, బాలిబోయిన రమేష్, అశోక్ కోదండరామయ్య, సురేష్‌రెడ్డి, గోపాల్ యాదవ్, కోడిపర్తి శ్రీధర్, జమళ్ళ వాసు, సాయి, ముని తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా నియమితులైన సందర్భంగా రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులను ఇటీవల నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను అందజేసిన పొణకా దేవసేనమ్మ.

# మాతృమూర్తి వర్ధంతిన.. శ్రీకంటి సేవలు

ఎస్.వి.రత్నం చారిటీస్ అధినేత, గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం గౌరవాధ్యక్షులు, ప్రముఖ సీనియర్ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు, తన తల్లి సుబ్బరత్నమ్మ 9వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 14న పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో రామ్మోహన్‌రావు దాతృత్వంతో 20 మంది పేద ఆలయ పూజారులకు ఆయన నివాసంలో బియ్యం, పలసరుకులు పంపిణీ చేశారు. వివేకానంద స్కూల్ విద్యార్థిని పి.సుదీప్తికి చదువు నిమిత్తం రూ.15,000లు, ఆంధ్ర యూనివర్శిటిలో బి.టెక్ చివరి సంవత్సరం చదువుతున్న కళ్యాణ్ హాస్టల్ ఫీజు కొరకు రూ.5,000లు, అలాగే సరస్వతి శిశు మందిరంలోని నలుగురు విద్యార్థుల పుస్తకాల నిమిత్తం రూ.6,000లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం ఉపాధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, వై.చిట్టిబాబు, పవన్, సభ్యులు పాల్గొన్నారు.






ఇటీవల గూడూరులో జరిగిన మెగా వ్యాక్సినేషన్‌లో భాగంగా వలయానందపురం సచివాలయంలో జరుగుతున్న వ్యాక్సినేషన్ తీరును పరిశీలిస్తున్న గూడూరు ఆర్డీవో వి.మురళీకృష్ణ.

# నిరాశ్రయులకు మధ్యాహ్న భోజనం



తాను చేపట్టే 'నెలలో ఓ రోజు అన్నదానం' కార్యక్రమంలో భాగంగా ఈనెల 13న శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, విజయవాడ రైల్వే డివిజన్ డిఆర్‌యుసిసి మెంబెర్, మయూరి స్వీట్స్ & బేకరి అధినేత రొటేరియన్ డాక్టర్ బి.శ్యామసుందరరావు(మయూరి శ్యామ్‌యాదవ్) గూడూరు పట్టణం గమల్లపాలెంలో ఉన్న మెప్మా మరియు మున్సిపాలిటీ సౌజన్యంతో నిర్వహిస్తున్న మైఫ్రెండ్స్ అసోసియేషన్ వసతి గృహంలోని నిరాశ్రయలకు మధ్యాహ్నం భోజనం, స్వీట్స్‌ను అందించారు.



గూడూరు మాజీ ఛైర్‌పర్సన్ యారం మంజులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించిన సందర్భంగా ఈనెల 12వతేదీ ఆమెను కలిసి అభినందనలు తెలియజేస్తున్న చెన్నూరుకు చెందిన శ్రీ శాలివాహన కళామందిర్ సంస్థ సభ్యులు వలమేటి మస్తాన్‌రావు, ఎస్.ఎ షరీఫ్, ముంగర ప్రసాద్, కలగట్ల లక్ష్మీనారాయణ, ఎస్.డి మస్తాన్‌వలీ, శివయ్య తదితరులు.

# వాడవాడలా గణపయ్యకు పూజలు



వినాయకచవితి సందర్భంగా ఈనెల 10న జిల్లాలో వాడ వాడలా వినాయకునికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. కరోనా నేపథ్యంలో వీధుల్లో గతంలో మాదిరిగా అంబరాన్నంటే సంబరాలు జరగకపోయినా ఇళ్ళలో, దేవాలయాల్లో విఘ్నేశ్వరునికి కన్నుల పండువగా విశేష అలంకారాలు, విశిష్ట పూజలు జరిగాయి. నెల్లూరు నగరంలో గతంలో మూడురోజుల పాటు పెద్దఎత్తున బాణసంచా వేడుకలు, మైకుల్లో గణనాధుని భక్తిపాటల హోరు.. తప్పెట్ల మోతలతో ఎంతో కోలాహలంగా జరిగే ఈ పండుగ వేడుక కరోనా మూలంగా ఈసారి వెలవెలబోయింది. వీధుల్లో ఎక్కడా సందడే లేదు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి. ఆయా ప్రాంతాల్లోని నాయకులు, ప్రముఖులు ఆ చుట్టుపక్కల ఉన్న వినాయకుని ఆలయాలకు వెళ్ళి స్వామిని దర్శించుకుని, కరోనా మహమ్మారి అంతమవ్వాలని కోరుకున్నారు. ఇళ్లలో వినాయకుని పూజలు చేసుకున్నవారు మాత్రం.. ఆ తర్వాత ఆ చిన్న మట్టి విగ్రహాలను కాలువలు, చెరువుల్లోనో, నదుల్లోనో నిమజ్జనం చేసి.. ఈసారికింతే స్వామీ క్షమించు.. అంటూ ప్రార్ధించుకున్నారు.

# వెంకటగిరి గురుకులంలో కరోనా

వెంకటగిరి గురుకుల విద్యాలయంలో కరోనా కలకలం సృష్టిస్తోంది. మొదట్లో నలుగురు బాలికలకు కరోనా నిర్ధారణ కావడంతో అందరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తే మొత్తంగా 18 మందికి కోవిడ్ వైరస్ సోకినట్లు తేలింది. దీంతో వారిని గూడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ఈ సంఘటనతో పాఠశాలలకు వెళ్లాలంటే విద్యార్థులు, తల్లిదండ్రులు హడలిపోతున్నారు.

**పొదలకూరులో టీచర్లకు కోవిడ్ :**

పొదలకూరు మండలంలోని పులికల్లు, కొత్తకంబాలపల్లి, బిరదవోలు పాఠశాలల్లో పనిచేస్తున్న అయిదుగురు ఉపాధ్యాయులకు కరోనా సోకినట్లు నిర్ధారణ అయింది. అదేవిధంగా సంగంలోని బాలయోగి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో పనిచేస్తున్న ఒక అధ్యాపకురాలికి కూడా కరోనా మహమ్మారి వ్యాధి సోకినట్లు సమాచారం.

# బుధ-శనివారాల్లో..పిల్లలకు టీకాలు

చిన్నపిల్లలకు బుధ-శనివారాల్లో జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో న్యూమోనోకోకల్ వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు ఏర్పాట్లు చేశామని, పుట్టిన బిడ్డ నుంచి అయిదేళ్ళలోపు పిల్లలకు ఈ టీకాలు వేస్తారని, జిల్లాలోని అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో ఈ టీకాలు వేయించుకోవచ్చని డిఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### రగ్బీలో సత్తా చాటిన

# నెల్లూరు క్రీడాకారులు

రగ్బీ పోటీల్లో నెల్లూరు క్రీడాకారులు తమ సత్తా చాటారు. రాష్ట్రస్థాయిలో రగ్బీ చాంపియన్‌లుగా నిలిచి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. కర్నూలులోని స్టేడియంలో ఈనెల 11న జరిగిన ఫైనల్స్‌లో అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య హోరాహోరీ పోరు జరిగింది. నిర్ణీత సమయంలో అనంతపురం 10 గోల్స్ సాధిస్తే నెల్లూరు జట్టు 30 గోల్స్‌తో విజయభేరి మోగించింది. చిత్తూరు జట్టు తృతీయస్థానంలో నిలిచింది. విజేతలను నెల్లూరుజిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం చీఫ్ కోచ్ రాజు, రగ్బీ సంఘం జిల్లా కార్యదర్శి సురేంద్ర, రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు అభినందిస్తూ బహుమతులు ప్రదానం చేశారు.

# న్యాయమూర్తులకు పదోన్నతి

జిల్లాలోని నలుగురు న్యాయమూర్తులకు పదోన్నతి కలిగింది. జూనియర్ సివిల్ జడ్జీలను సీనియర్ సివిల్ జడ్జీలుగా పదోన్నతి కల్పిస్తూ ఇటీవల హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. నెల్లూరు నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.మాధవీదేవి, అయిదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.లీలా వెంకటశేషాద్రి, కావలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శైలజ, ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి ఎలమర్తి శ్రీనివాసరావులకు సీనియర్ సివిల్‌జడ్జిలుగా పదోన్నతి కల్పించింది.

# గనుల శాఖకు కొత్త ఏ.డి

నెల్లూరు గనుల శాఖకు కొత్త అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఏలూరులో ఏ.డిగా పనిచేస్తున్న శ్రీనివాసరావు వచ్చారు. ఇప్పటిదాకా ఇక్కడున్న కె.వెంకటేశ్వర్లు శ్రీకాకుళం గనుల శాఖ విజిలెన్స్ విభాగం ఏ.డిగా బదిలీ అయ్యారు.

# పులికాట్‌పై శాస్త్రవేత్తల అధ్యయనం



ఆంధ్ర-తమిళనాడు సరిహద్దుల్లో విస్తరించి ఉన్న పులికాట్ సరస్సుపై వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా-డెహ్రాడూన్‌కు చెందిన పలువురు శాస్త్రవేత్తలు ఇటీవల విస్తృతంగా అధ్యయనం చేశారు. గత నాలుగేళ్లలో పులికాట్‌కు వచ్చే వలసపక్షుల సంఖ్య పెరిగిందా?.. ఈ పక్షుల రక్షణకు స్థానికుల సహకారం ఎలా ఉంది.. తదితర అనేక అంశాలను వారు పరిశీలించారు. ముఖ్యంగా పులికాట్‌లో నీటిసామర్థ్యాన్ని పెంచేందుకు, పక్షుల రాకపోకలకు అనువుగా మరిన్ని చర్యలు తీసుకునేందుకు ఉన్న అవకాశాలను వారు పూర్తిస్థాయిలో అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులను అడిగి పలు విషయాలను తెలుసుకున్నారు. తడ మండలంలోని అటకానితిప్ప నుంచి పులికాట్ సరస్సులో ఇరకం, వేనాడు దీవులను భీములవారిపాళెం పరిసర ప్రాంతాల్లోనూ వీరు పర్యటించి వాస్తవ పరిస్థితులను అంచనా వేశారు. శాస్త్రవేత్తలు రాజశేఖర్ వెంకట నార్ల, డాక్టర్ కె. శివకుమార్, మోనాలిసెన్, గౌతం తలక్‌దార్‌లతో పాటు అటవీశాఖ చీఫ్ కన్సర్వేటర్ శరవణన్, డిఎఫ్ఓ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

# 'స్కందపూర్వజ శతకము' ఆవిష్కరణ



పద్య సారస్వత పరిషత్ నెల్లూరుజిల్లా శాఖ అధ్యక్షులు, ప్రముఖ పద్యకవి పోలవరపు లక్ష్మీనరసింహారావు రచించిన 'స్కందపూర్వజ శతకము'ను ఇటీవల నెల్లూరులో ఆవిష్కరించారు. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మహాగణపతిని స్తుతిస్తూ వెలువడిన ఈ శతకంలో విఘ్నేశ్వరునితో పాటు కుమారస్వామిని కూడా స్మరించుకుంటూ ఎంతో విశేషంగా 'స్కందపూర్వజ యిదె వందనమ్ము' అనే మకుటంతో ఉన్న ఈ పద్యాల్లో ప్రతి పద్యం ఒక భక్తిపుష్పంగా శోభిల్లుతోందంటూ వక్తలు కొనియాడారు. ప్రముఖ కవి అగస్త్యరాజు సుబ్బారావు సభకు అధ్యక్షత వహించగా, స్థానిక సింహపురి ధార్మిక సంస్థ వ్యవస్థాపకుడు ఉచ్చి భువనేశ్వర్‌ప్రసాద్ ఆవిష్కరించారు. విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు విద్వాన్ డా. చీమకుర్తి వెంకటేశ్వర్‌రావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ ఈ శతకాన్ని సమీక్షించారు. ఊరుబిండి వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి, చక్కిరాల జయప్రసాద్, ఎం.రామ్‌గోపాల్, గుండాల నరేంద్రబాబు, మనుబోలు శేషారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తంగిరాల నరసింహప్రసాద్, సుభాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# అపురూపమైన ఆలయం.. వింజమూరు శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయం

***భగవంతుడు సర్వాంతర్యామి. అన్ని ప్రాంతాల్లోనూ ఉంటాడు. అనేక రూపాలతో భక్తులకు దర్శనమిస్తూనే ఉంటాడు. అందులోనూ కోరిన కోర్కెలు నెరవేర్చే భక్తవరదుడైన ఆ అనంతుని మహిమలు అనంతం. ఏ పేరున పిలిచినా, ఏ తీరున కొలిచినా ఆ భగవంతుడు ఒక్కడే అన్నట్లుగా దేవదేవుడైన శ్రీ మహావిష్ణువు శివకేశవులకు అభేదాన్ని చాటుతూ శ్రీ చెన్నకేశవస్వామిగా ఇలపై అవతరించాడని అంటారు. అందుకే దేశంలో చెన్నకేశవస్వామి దేవాలయాలు అనేకం ఉన్నాయి. అలాంటి విశిష్టమైన ఆలయాల్లో నెల్లూరుజిల్లా వింజమూరులో ఇరు దేవేరులతో కొలువై ఉన్న శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం ఒకటి. అందులోనూ ఈ ఆలయం ఎంతో పురాతనమైనదే కాక.. మరెంతో అపురూపమైనదని, మహిమాన్వితమైనదని కూడా భక్తులు చెప్తుంటారు. పురాతనకాలం నాటి ఈ ఆలయ ఆవిర్భావం గురించి పలు కథనాలున్నాయి.***








**ఆలయ చరిత్ర :**

నెల్లూరు నగరానికి సుమారు 36 కిలోమీటర్ల దూరంలో వింజమూరు ఉంది. ఇదిప్పుడు మండల కేంద్రం. పూర్వకాలంలో ఈ ప్రాంతమంతా రాజుల పాలనలో ఉండేది. వింజమూరు ప్రజలకు ఇలవేల్పుగా, అలనాటి పలనాటి రాజ వంశాలకు కులదైవంగా శ్రీ చెన్నకేశవస్వామి ఎంతో ప్రసిద్ధి. ఒకప్పుడు ఉదయగిరి, వింజమూరు తదితర ప్రాంతాలన్నీ శ్రీకృష్ణదేవ రాయల పాలనలో కూడా ఉండేవి. ఇంకా అనేకమంది రాజులు, రాజవంశస్తులు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. వారి పాలనలో ఈ ఆలయం ఎంతో ప్రాభవ వైభవాలు కలిగి ఉండేదని అంటారు. ఒకప్పుడు వింజమూరు తిరుమలై అనే అయ్యంగార్ల కుటుంబాలు ఇక్కడ నివాసం ఉండేవని, ఆ పేరుతో ఈ ప్రాంతం వింజమూరుగా ప్రాచీనకాలం నుంచే వాడుకలోకి వచ్చిందని, కాలక్రమంలో వారంతా తిరుమలకు వెళ్ళిపోయి అక్కడ కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని సేవలో ఉండేవారని చెప్తుంటారు. పురాతన కాలం నుంచి ఇక్కడ ఇరు దేవేరులతో కొలువై ఉన్న భూ నీలా సమేత శ్రీ చెన్నకేశవస్వామి ఆలయాన్ని ప్రజలు నిత్యం దర్శించుకుంటూ ఆ స్వామి అనుగ్రహం కోసం పూజలు, ఉత్సవాలు చేస్తున్నారు. నేటికీ వింజమూరు ప్రజలకు శ్రీ చెన్నకేశవస్వామి ఆరాధ్యదైవం. ఈ ఆలయానికి కొద్దిదూరంలో వింజమూరు గ్రామదేవత వింజేటమ్మ ఆలయం కూడా కొలువై ఉండడం విశేషం.

**18వ శతాబ్దంలో ఆలయ పునర్నిర్మాణం :**

పలువురు రాజవంశస్తుల ఏలుబడిలో ఈ ఆలయం నిత్యకల్యాణం పచ్చతోరణంలా కళకళలాడుతు ఉండేదని, శ్రీకాళహస్తి జమీందారుల పరిపాలనలో ఉన్నప్పుడు స్వామివారికి నిత్యపూజలు వైభవంగా జరిగేవని స్థానికుల కథనం. కాలక్రమేణా శిథిలావస్థకు చేరిన శ్రీ చెన్నకేశవస్వామి ఆలయాన్ని 18వ శతాబ్దంలో కడప ఓబులరెడ్డి అనే భక్తుడు జీర్ణోద్ధరణ గావించారని ఆ తర్వాత గణపం సుంకిరెడ్డి అనే మరో భక్తుడు ఈ ఆలయాన్ని మరింత అందంగా, సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాడని కూడా అంటారు. ఆ తర్వాత 1924 ప్రాంతంలో వానమామలై జియ్యంగారు స్వామీజీ ఈ ఆలయాన్ని సందర్శించి గ్రామస్తులందరితో సమావేశమై ఆలయంలో అఖండదీపాన్ని వెలిగించి ప్రత్యేక పూజలు చేసి సంప్రోక్షణ, పుణ్యాహవచనం చేయడంతో నాటి నుంచి ఆలయం మరింత ప్రసిద్ధిలోకి వచ్చిందట. 1981లో ఈ ఆలయం దేవాదాయశాఖ పరిధిలోకి వచ్చింది. అధికారులు, ఆలయ నిర్వాహకులు, స్థానిక ప్రజలు అందరూ కలసి శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తూనే ఉన్నారు. నిత్యపూజలు, ధూపదీప నైవేద్యాలు, ప్రతి ఏటా స్వామివారికి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుండడంతో ఆలయం ఇటీవలి కాలంలో మరింతగా ప్రఖ్యాతిలోకి వచ్చింది.

**అపూర్వమైన ఆలయం :**

చుట్టూ పచ్చని చెట్లతో, విశాలమైన ప్రాంగణంలో, సుప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంలో శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం భక్తులకు నయనానందకరంగా కొలువుదీరి ఉంది. ఎంతో అపూర్వమైన ఈ ఆలయంలో ఆలయ ప్రాకారం, ఎత్తయిన గోపురం, దానిపై దేవతామూర్తుల ప్రతిమలు, అంతరాలయం, శ్రీ స్వామివారి గర్భాలయం అన్నీ దేనికవే ప్రత్యేకత అన్నట్లుగా ఉంటాయి. ఆలయం చుట్టూ పెద్దపెద్ద ప్రహరీ గోడలు, ఆలయ ప్రవేశద్వారం గోడలపై రకరకాల దేవతామూర్తుల శిల్పాలతో.. ఆలయమంతా అత్యద్భుతమైన రీతిలో సర్వాంగసుందరంగా రూపుదిద్దుకుంది. శ్రీ చెన్నకేశవస్వామిని మనసారా కొలుచుకుంటే ఎంతటి కష్టాలైనా సమసిపోతాయని, కోరుకున్న కోర్కెలు తీరి జీవితాలు సుఖప్రదంగా, శుభప్రదంగా ఉంటాయని భక్తుల నమ్మకం.

# పాత్రికేయ విలువల వాస్తవ కోణం.. రాయుడు సంధించిన అక్షర బాణం

# 'రాస్తూనే ఉందాం!'







**రచన :**
**భోగాది వేంకట రాయుడు**
**వెల : రూ. 110/- పేజీలు: 391**
**ప్రతులకు:**
**ప్రెస్ క్లబ్**
**బషీర్‌బాగ్, హైదరాబాదు.**
**bhogadirayudu2152@gmail.com**

పాత్రికేయ వృత్తిని అసిధారా వ్రతంగా, నిష్కామకర్మగా ఆచరించి నిజాయితీ, నిర్భీకతతో పరిశోధనాత్మకంగా, పుంఖానుపుంఖాలుగా కథనాలు వెలువరించిన నిఖార్సయిన పాత్రికేయ సూర్యుడు, కలం వీరుడు భోగాది వేంకట రాయుడు. ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే ఉన్నతమైన ప్రమాణాల జర్నలిజం అత్యంత ఆవశ్యకం. ఆ అవసరాన్ని నియమబద్ధంగా నిర్మాణాత్మకంగా నిర్వహించి సత్తాచాటిన రాయుడు, తన జర్నలిజం ప్రస్థానంపై ఆసక్తికరమైన కథనాల సంపుటిని వెలువరించారు. రాయడు, రాయడు అని పిలిపించుకొనే రాయుడు 'రాస్తూనే ఉందాం!' అంటూ తన నలభై ఏళ్ళ పాత్రికేయ ప్రయాణాన్ని, ప్రయోగాల్ని విశదీకరిస్తూ ప్రచురించిన ఈ పుస్తకం జర్నలిజం చరిత్రలో ఒక నూతనాధ్యాయం. ఇది అపురూపం..!, అనిర్వచనీయం. క్షణక్షణం ఉత్కంఠ రేపుతూ అక్షర విందు చేసిన రాయుడు అభినందనీయుడు.

ఓ లేఖా రచయితగా ప్రారంభమైన రచనా వ్యాసంగం.. బ్యూరో చీఫ్ స్థాయికి ఎదగడంలో రాయుడి కృషి అద్వితీయం. ఎంతో మందికి ఆదర్శం. ఈ రచన ఎంతోమంది జర్నలిస్టులకు స్ఫూర్తిప్రదాయకంగా నిలుస్తుంది. మార్గదర్శనమూ చేస్తుంది. కలంతో కరచాలనం చేయించి ఉత్కంఠ భరితంగా కథనాల్ని మలచడం భోగాది దిట్ట అయిన సందర్భాలెన్నో విందు చేస్తాయి.

రాయడం నా వృత్తి, వ్యసనం, వ్యాపకం అంటారు రాయుడు. ఏదైనా అంశం మీద రాయాలని అనుకొంటే రాసేదాక నిద్రపట్టదు, అన్నం సహించదు, మనిషిగా ఉండలేనని కూడా చెప్తారు. దాన్ని జెనటిక్ ప్రాబ్లమ్‌గా అభివర్ణిస్తారు రాయుడు. ఇది జెనటిక్ ప్రాబ్లమ్ అనిపించదు. సమాజం పట్ల బాధ్యత స్వీకరించిన నిజమైన జర్నలిస్టు పడే వేదన, తపన, సంఘర్షణ!


కులదీప్ నయ్యర్ రాసిన 'బిట్వీన్ ద లైన్స్', జనార్దన్ ఠాగూర్ రాసిన 'ఆల్ ది ప్రైమ్‌మినిస్టర్స్' చదివాక జర్నలిస్టు కావాలనే కోరిక బలపడిందంటారు రాయుడు. జర్నలిజం అనేది ఓ గౌరవప్రదమైన వృత్తేగాక జీవితకాలం వదులుకోనవసరం లేని గొప్ప ప్రొఫెషన్‌గా భావించారు వేంకటరాయుడు తన అంకిత భావంతో. సమయస్ఫూర్తితో జర్నలిజంలో సామాజిక బాధ్యతకు నూటికి నూరుపాళ్ళు న్యాయం చేసిన వ్యక్తి భోగాది. ఆయన కలంలోని గాంభీర్యం, పరుగులు పెట్టించే తనం, గాఢత కలిసి మనల్ని ఉక్కిరిబిక్కిరి చేసే కథనాల సంపుటిని 'రాస్తూనే ఉందాం!'గా మనకు గొప్ప బహుమతినే అందించారు. దివి సీమ గాంధీగా పేరొంది న మండలి వెంకటకృష్ణారావుతో దివిసీమ పునర్నిర్మాణ పనుల్ని రిపోర్ట్ చేసిన రాయుడు దివిసీమ బాధితులకు (ఆంధ్రజ్యోతి ద్వారా) మరింత సాయం అందేలా కృషి చేసిన సంఘటనలు మనకు కన్పిస్తాయి.

ఎంతో నిబద్ధతతో ఉద్యోగించిన రాయుడు కులసంఘాల వార్తలకు ప్రాముఖ్యత నివ్వలేదు. వార్తల్ని సెన్సేషన్ల తలంపుతోగాక వార్తా ప్రాముఖ్యతను బట్టి ప్రాధాన్యాలను ఏర్పరిచేవారని, ప్రమాణాలు నెలకొల్పేవారని అవగతమవుతుంది. ప్రభుత్వ అతిథిగృహాల్ని వార్తా ఉత్పత్తికేంద్రాలుగా చెప్పు, మంత్రిగారు ప్రభుత్వ అతిథిగృహంలో నిర్వాకాన్ని కాకుండా, ఆయన మౌనాన్ని ఆనాటి చెన్నారెడ్డి ప్రభుత్వ అవినీతిపై అసంతృప్తేనని పేల్చడం రాయుడులోని పరిణతికి నిదర్శనం. ఇలాంటి సమయోచిత ప్రజ్ఞలు నూతన జర్నలిస్టులకు పాఠ్యాంశాలుగా ఉపకరిస్తాయంటే అతిశయోక్తి కాబోదు.

తన ముక్కుసూటితనంతో, నిజాలను నిఖ్ఖచ్చిగా చెబుతూ కూడా తన ప్రయాణంలో ఎంతోమంది మిత్రుల్ని సంపాదించుకో గల్గడం ఆయనకే చెల్లింది. నాలుగు దశాబ్దాల రాజకీయాలకు దర్పణంగానే గాక, రాయుడు చేసిన చక్కని విన్యాసాల పరంపర ఈ పుస్తకంలో కన్పిస్తుంది. రాయుడు మొండివాడని తెలుస్తుంది. రాయుడులోని జర్నలిస్టు సంధించిన దాహం తీరని తృష్ణగా ద్యోతకమవుతుంది. 'స్పిరిట్ ఆఫ్ జర్నలిజం'ను యువ జర్నలిస్టులు అందుకోవాలని ఆయన చేస్తున్న తపస్సుకు అక్షర నమస్కారం!

రాయుడు అక్షర బాణాలు సంధిస్తుంటే వెస్ట్‌గోదావరి కలెక్టర్ ఆయన్ను మీసా క్రింద అరెస్టు చేయాలనుకోవడం, సాక్షాత్తూ ఆ జిల్లా ఎస్.పి రామలింగేశ్వర్రావే బహిర్గతం చేయడం లాంటి సంఘటనల్తో రాయుడి కలం సంపాదించుకొన్న అభిమానం తేటతెల్లమవుతుంది. జిల్లా ఎస్.పి, కలెక్టరు మాటను వ్యతిరేకించడం వెనుక రాయుడి కలం నిజాల నికషోపలాన్ని మనకు తెలుపుతుంది. ఎస్.పి రామలింగేశ్వర్రావు కోసం డిఎస్పీ వెళ్ళి గోదావరి ఎక్స్‌ప్రెస్‌ను అరగంట లేటు చేయించిన వైనంతో వాస్తవ కోణాలకు అద్దంపడ్తుందీ పుస్తకం. చెబితే వినడు, తప్పు రాయడు అనిపించుకొన్న రాయుడు రాసిన పుస్తకం కదా మరి! ఇండియా టుడే వ్యాసకర్త అమరనాథ్ మీనన్ కోసం బస్‌ను ఆపించిన సంఘటన కూడా ఔరా అన్పిస్తుంది.

వెస్ట్‌గోదావరి యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల తొలి సదస్సు విజయవంతం రాయుడులోని నాయకత్వ లక్షణాలకు ప్రతీక. ఆనాటి ఏపియుడబ్ల్యూజె లోగోను 38 సంవత్సరాలుగా వాడబడడం ఆయనలోని దార్శనికతకు పతాక.



ఇటీవల హైదరాబాద్, ఖైరతాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆడిటోరియంలో జరిగిన 'రాస్తూనే ఉందాం' గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న 'పద్మభూషణ్' కే. ఐ. వరప్రసాద్ రెడ్డి, 'పద్మభూషణ్' కే.పద్మనాభయ్య, డాక్టర్. కే. వీ. పి. రామచంద్రరావు, మండలి బుద్ధ ప్రసాద్, కే. శ్రీనివాస్‌రెడ్డి.

నోరు జారిన ఎంఎల్‌ఏ నీలం చార్లెస్ ఔట్ అయిన ఉదంతం నాయకుల దుర్నీతిని ఎండగడ్తుంది. డిన్నరుకు ఆహ్వానించిన ఎంఎల్ఏ ప్రలోభాన్ని, వార్తే రాకుండా చేసిన సందర్భాన్ని చెప్తూ తక్కువ చేస్తే సహించలేని తత్వమే తనను నడిపించిందని చెప్తాడు రాయుడు. ఇది కూడా జెనటిక్ ప్రాబ్లమేననడం ఆయనలోని నిజాయితీకి దర్పణం.

నల్లజెర్ల, దెందులూరు వ్యభిచారిణుల్లో అన్ని కులాలు ఉండడాన్ని ఉద్వేగంగా చెప్తూ 'వాళ్ళందరిదీ ఆకలి కులం' అంటారు బాధాతప్త హృదయంతో! జర్నలిజమే ప్రాణంగా బతికే రాయుడు తమ్ముడు తమ్ముడే... పేకాట పేకాటేనంటారు! ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 'మస్కులర్ డిస్ట్రోఫీ' అనే వ్యాధితో బాధపడే అస్థిపంజరం లాంటి అబ్బాయి ఫోటోను, ట్యాప్ చేసి సంపాదించి క్రెడిట్ కొట్టేసిన రాయుడి మాటలివి. జర్నలిజంలోనే జీవించిన సంఘటనలకిది పరాకాష్ఠ.

రెడ్డి కాంగ్రెస్‌లో నుంచి మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వాన్ని ఉతికి ఆరేస్తున్న కొణిజేటి రోశయ్య ఒక్కసారిగా ఇందిరా కాంగ్రెసులో చేరి రోడ్లు భవనాల శాఖ మంత్రిగా పదవి పొందడం ఆనాటి సంచలన వార్తైతే, ఏలూరు వచ్చిన రోశయ్యతో చెన్నారెడ్డి ప్రభుత్వ నిజాయితీపై ఆయన అభిప్రాయాన్ని అడగడం ఆయన మౌనాన్ని బ్లాస్ట్ చేయడం సాహసం కాక మరేమిటి! చాలారోజుల తర్వాత రోశయ్యను కలిసినపుడు ఆ వంకర రాతలు మానేశావా అని అడగడాన్ని నిజాయితీగా చెప్తాడు రాయుడు.


తణుకు సామ్రాజ్యాధీశుడు ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్ అకృత్యాల మీద నాలుగంచెల ఉదయం స్టోరీ, క్రిస్టియన్ మొనాస్టినీ స్టోరీ, షిప్‌లో వ్యభిచారాల్ని వెలికి తెచ్చే 'కడలి నుడిలో ఆడపడుచుల అంతర్మధనం', 'వెట్టి చాకిరీ బ్రాహ్మణుల వృత్తాంతం' అన్నీ పెను సంచలనాలయ్యాయి. 'ఉదయం'ను పతాక స్థాయికి తీసుకెళ్ళాయి. రాయుడికి జనం గుండెల్లో గుడికట్టారు.

రాయుడు ఎవరు ఏ సహాయం చేసినా ఎవరినీ మరువని మానవతావాదిగా అవగతమవుతుంది. విమర్శించాల్సి వచ్చినపుడు ఎన్టీఆర్‌నూ వదల్లేదు, చంద్రబాబునూ వదల్లేదు.

ప్రారంభం నుంచి చివరిదాకా చదివించగల్గే సత్తా ఉన్న 'రాస్తూనే ఉందాం!' జర్నలిస్టులకు కరదీపిక. ఇదో పాత్రికేయ విలువల వాస్తవకోణం, రాయుడు సంధించిన అక్షర బాణం.



**సమీక్ష :**
**చిన్ని నారాయణరావు**
**9440202942**

శ్రద్ధాంజలి

ప్రముఖ రంగస్థల మరియు సినీ నటులు

శ్రీ శ్రీధర లక్ష్మీ నరసింహం (S.L.నరసింహం) గారు

రిటైర్డ్ పోస్ట్ మాస్టర్, వెంకటగిరి

తేది 09.09.2021 గురువారం నాడు స్వర్గస్తులైనారు.

వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమార్తె : ఎమ్.రజని

అల్లుడు : డాక్టర్ మర్మావుల సుబ్రహ్మణ్యం

విశ్రాంత ప్రిన్సిపాల్, వి.ఆర్.కళాశాల, నెల్లూరు.

మనుమడు

ఎమ్.రామచంద్ర కాశ్యప్ - ఎమ్.వి.ఎస్.నిఖిత, U.S.A.

మనుమరాలు

ఎమ్.అనన్య భార్గవి - తొర్నాల నంద జ్ఞాన్, U.S.A.

జననం : 27.12.1929 మరణం : 09.09.2021


## విశ్రాంత అధ్యాపకుడు.. దర్శి చెంచుకృష్ణయ్య కన్నుమూత



ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని డైట్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేసి రిటైరైన దర్శి చెంచు కృష్ణయ్య (69) ఇటీవల అస్వస్థతకు గురై కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరి స్వస్థలం కలువాయి మండలం కుల్లూరు. కోటలో చదువుకున్నారు. ఆ తర్వాత గూడూరు, చెన్నూరు జడ్పీ హైస్కూళ్ళలో ఉపాధ్యాయునిగా ఎంతో అంకిత భావంతో పనిచేశారు. గత కొంతకాలంగా ఆయన నెల్లూరులో నివాసం ఉంటున్నారు. మంచి స్నేహశీలి. సౌమ్యుడు. తెలుగుభాష అంటే మక్కువ ఎక్కువ. ఆయన మరణానికి విచారం వ్యక్తంచేస్తూ ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం ప్రకటించారు.

● శెభాష్ ఎస్పీ గారూ!...

యువతిపై దాడి ఘటనలో..

# గంటల వ్యవధిలోనే నిందితుల అరెస్ట్




***ఒక యువతిని క్రూరతో అమానుషంగా కొడుతూ ఉన్న దృశ్యాలను వాట్సప్ వగైరాల్లో చూసిన జిల్లావాసులంతా ఎంతగానో కలత చెందారు. ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న నెల్లూరుసీమలో కూడా ఇంతటి ఘోరాలు జరుగుతున్నాయా?.. అంటూ ఆవేదన చెందారు. ఇలాంటి దారుణాలను అడ్డుకునేవారే లేరా?..అని అందరూ బాధపడుతున్న సమయంలోనే 'మేమున్నాం'..అంటూ నెల్లూరు పోలీసులు రంగంలోకి దిగి కేవలం గంటల వ్యవధిలోనే ఆ నిందితులను పట్టుకుని అరెస్ట్ చేయడంతో జిల్లా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ పోలీసుల ప్రతిభను ప్రశంసిస్తున్నారు. ప్రత్యేకించి 'శెభాష్ ఎస్పీ' అంటూ జిల్లా ఎస్పీ విజయారావును అందరూ అభినందిస్తున్నారు.***

ఈ ఘటనలో నిందితులైన నెల్లూరు రూరల్ పరిధిలోని రామకోటయ్యనగర్‌కు చెందిన పల్లా వెంకటేష్, కె.శివకుమార్‌లను అరెస్ట్ చేసి బుధవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒక యువతిపై అమానుషంగా క్రూరతో దాడిచేస్తూ వీడియో చిత్రీకరించి పైశాచికానందాన్ని పొందిన ఇద్దరు నిందితులను నెల్లూరు పోలీసులు కేవలం గంటల వ్యవధిలోనే అరెస్ట్‌చేసి శెభాష్ అనిపించుకున్నారు. మూడు నెలల కిందటి ఈ వీడియో తాజాగా ఈనెల 15న వాట్సప్, ట్విటర్‌తో పాటు పలు చానళ్ళలో రావడంతో వెంటనే స్పందించిన జిల్లా ఎస్పీ విజయారావు ఆ నిందితులను పట్టుకునేందుకు మూడు ప్రత్యేకబృందాలను రంగంలోకి దింపడంతో పోలీసులు సాంకేతికత సాయంతో నిందితులను గుర్తించి జిల్లాలోని తెగచర్ల వద్ద వారిని అరెస్ట్ చేశారు. ఈనెల 15 మధ్యాహ్నమే వారిని పట్టుకుని జిల్లా ఎస్పీ విజయారావు ఆ నిందితుల వివరాలను మీడియాకు తెలియజేశారు. నెల్లూరు రామకోటయ్యనగర్‌కు చెందిన పల్లాల వెంకటేష్, కె.శివకుమార్‌లు ఈ ఘటనలో నిందితులు. వెంకటేష్ టిప్పర్ డ్రైవర్. కుటుంబ కలహాలతో భార్య విడిచిపెట్టి వెళ్ళిపోగా వెంకటేష్ మరో యువతితో సన్నిహితంగా ఉండేవాడు. అయితే ఆ యువతికి వెంకటేష్ ప్రవర్తన నచ్చక దూరంగా ఉంచదాన్ని సహించలేక నీతో మాట్లాడాలంటూ ఆమెను కొత్తూరు దగ్గర ఎవరూ లేని చోటుకు తీసుకువెళ్ళి చేతులతో, క్రూరతో ఇష్టం వచ్చినట్లు దాడిచేశాడు. గాజులు పగిలిపోయి నెత్తురోడుతున్నా కనికరించకుండా కొడుతూ, తనను వదిలేయమని ఏడుస్తున్నా వదలకుండా హింసించడమేకాక, అదంతా తన స్నేహితుడైన శివకుమార్‌తో వీడియో తీయించాడని, యువతిపై ఇంతటి అకృత్యానికి పాల్పడిన వారిద్దరిపై రౌడీషీట్లు తెరుస్తున్నామని ఎస్పీ తెలియజేశారు. వీడియో వైరల్ అయిన కొద్దిగంటల్లోనే నిందితులను గాలించి పట్టుకున్న నెల్లూరు నగర డిఎస్పీ శ్రీనివాసులురెడ్డిని, వేదాయపాళెం ఇన్స్‌పెక్టర్ రామకృష్ణను, ఇతర సిబ్బందిని ఎస్పీ విజయారావు అభినందించారు.

**సిఎంను కూడా కలచివేసిన ఘటన:**

నెల్లూరు రూరల్‌లో ఒక యువతిని అమానుషంగా కొడుతూ క్రూరతో దాడిచేసిన ఘటన ముఖ్యమంత్రి జగన్‌ను తీవ్రంగా కలచివేసింది. అదేవిధంగా విశాఖలో తొమ్మిదేళ్ళ బాలికపై జరిగిన ఘోరంతో సహా ఈ ఘటనలు దారుణమంటూ సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేరాలకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. వీటిని కట్టడిచేసేందుకు పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# పారని రఘురామ పాచిక



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ నగదు బదిలీ పథకాల లబ్ధిదారులు, అసంఖ్యాక జగన్ అభిమానుల ప్రార్థనలను న్యాయదేవత ఆలకించింది. వైసీపీ వదిలేసిన అమలాపురం ఎం.పి రఘురామ రాజు 'బెయిలు రద్దు పథకాన్ని' సీబీఐ కోర్టు తిరస్కరించింది. ముఖ్యమంత్రి జగన్, ఎం.పి విజయసాయిరెడ్డికి ఇప్పుడు ఉన్న బెయిల్‌ను రద్దు చేయాలంటూ రఘురామ రాజు హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టులో దాఖలు చేసిన వేరు వేరు పిటిషన్లను కోర్టు బుధవారం కొట్టేసింది. నిజానికి జగన్, సాయిరెడ్డి కేసులలో ఆ ఎం.పి ఏ మాత్రం సంబధితుడు కాదు. కేవలం రాజకీయ వ్యతిరేకత, వ్యక్తిగత కక్షతోనే ఆయన ఈ పిటిషన్‌ను దాఖలు చేశారనే విషయంలో ఎవరికీ సందేహాలు లేవు. పిటిషన్ దాఖలు చేయడంలో పిటిషనర్‌కు నిజాయితీ గానీ, చిత్తశుద్ధి గానీ తొలినుంచీ కనిపించలేదని న్యాయవాదులు వ్యాఖ్యానిస్తున్నారు. ఢిల్లీ నుంచి రోజువారీ ప్రెస్‌మీట్లు, అనుకూల ఛానెల్స్‌లో నిత్యం డిబేట్లతో ఈ అంశానికి విపరీతమైన ప్రచారం కల్పించారని, వీటి ద్వారా కోర్టు తీర్పును ప్రభావితం చేయడానికి శక్తివంచన లేకుండా పనిగట్టుకుని మరీ కృషిచేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసు నుంచి రాజకీయ లబ్ది పొందడానికి కూడా వైసీపీ వ్యతిరేకశక్తులు పెద్ద ప్రయత్నం చేశాయి.

నిజానికి, ఈ కేసులలో నిందితులైన జగన్, సాయిరెడ్డితో ఏ రకమైన సంబంధం లేని.., వ్యక్తిగత ప్రయోజనం ఉండడానికి అవకాశం లేని వారు ఇటువంటి పిటిషన్‌తో కోర్టును ఆశ్రయించి ఉన్నట్లయితే, చర్చ పక్కదారి పట్టి ఉండేది కాదని... కానీ, తన వ్యక్తిగత రాజకీయ కక్ష తీర్చుకోడానికే రఘురామ రాజు ఈ పిటిషన్లు దాఖలు చేసినందువల్ల తొలిరోజు నుంచీ ఈ ఫలితం వూహించిందనేనని, సీబీఐ కోర్టు సరైన నిర్ణయమే తీసుకుందని విజయవాడకు చెందిన సీనియర్ న్యాయవాది బి.ఎం.డీ. రాయలు అభిప్రాయపడ్డారు. ఒక నిందితుడికి బెయిల్ రద్దుచేయాలని కోరే థర్డ్ పార్టీకి ఎటువంటి స్వప్రయోజనాలూ ఉండకూడదన్నది ఆయన వాదన. నిజానికి, జగన్ బెయిల్ రద్దుకు 'దారి తప్పిన' వైసీపీ ఎం.పి పిటిషన్ దాఖలు చేసిన ఏప్రిల్ 6వ తేదీ నుంచి కూడా సీబీఐ కోర్టును ప్రభావితం చేయడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి.

చివరగా సీబీఐ న్యాయమూర్తికి దురుద్దేశాలు అంటగట్టడానికి కూడా రఘురామ రాజు జంకలేదు. బుధవారం తీర్పు వెలువడాల్సివున్న తరుణంలో, సీబీఐ కోర్టు న్యాయమూర్తికి వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

5 నెలలకు పైగా సాగిన ఈ మొత్తం వ్యవహారంలో పిటిషనర్‌కు ఎటువంటి సదుద్దేశాలు లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులు, ప్రపంచవ్యాప్తంగా జగన్ అభిమానులు ఆకాంక్షించిన తీర్పే వెలువడింది.

సి.ఎం జగన్ ఇక ఇప్పుడు పాలన, సంక్షేమ పథకాల అమలుపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టి, నిర్విఘ్నంగా నగదు బదిలీ బటన్లు నొక్కేయొచ్చు.

# టిడిపి నాయకుల నిరసనలు



టిడిపి యువనాయకుడు నారా లోకేష్ గుంటూరు పర్యటనను పోలీసుల అడ్డుకోవడం పట్ల జిల్లాలో నిరసనలు పెల్లుబుకాయి. నెల్లూరులో టిడిపి నగర ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ లోకేష్ పర్యటనను ప్రభుత్వం అడ్డుకోవడం దారుణమన్నారు. అలా చేయడం అప్రజాస్వామికమని ధ్వజమెత్తారు. లోకేష్‌బాబంటే సిఎం జగన్‌కు ఎందుకంత భయమంటూ విమర్శించారు. ఈ సందర్భంగా నెల్లూరులో పలువురు టిడిపి నాయకుల ఆందోళనలను పోలీసులు అడ్డుకున్నారు. వి.ఆర్ కాలేజీ సెంటర్‌లో నిరసన తెలియజేస్తున్న టిడిపి మైనార్టీ సెల్ నాయకుడు సాబిర్‌ఖాన్‌ను అరెస్ట్ చేశారు. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని పోలీసులు గృహనిర్బంధంలో పెట్టారు.

# ఉపాధ్యాయులకు ప్రగతి సన్మానాలు



ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీ గూడూరు, ప్రగతి సేవాసంస్థ వారు లక్షలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన 7 మంది ఉపాధ్యా యులను ఘనంగా సన్మానించారు. సనత్‌నగర్‌లోని శ్రీచైతన్య స్కూలులో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సయ్యద్ మహబూబ్ బాషా, శ్రీమతి అల్లూరు కళ్యాణి, శ్రీమతి జక్కుంరెడ్డి ప్రవీణ కుమారి, మాముదూరు రాధయ్య, శ్రీమతి కొండూరు శివకళ, సున్ని ప్రాణేష్, ఆములూరు మురళీమోహన్‌లను ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ రోహిణి చేతులమీదుగా సన్మానించారు. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు బండి ధనంజయరెడ్డి, సెక్రెటరీ చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, పి.డి.కరిముల్లా, వాకాటి రామ్మోహన్‌రావు, ప్రజేందర్‌రెడ్డి, పురందర్‌రాజు, గ్రానైట్ ప్రభాకర్, వాచ్‌షాప్ రాము, జయపాల్‌రెడ్డి, ఆక్వా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలేశుని సేవాభాగ్యం

(మొదటి పేజీ తరువాయి)

తిరుమల తిరుపతి దేవస్థానానికి 30 మంది సభ్యులతో నూతన పాలకమండలిని నియమిస్తూ ప్రభుత్వం ఈనెల 15న ఉత్తర్వులిచ్చింది. 28 మందిని పాలకమండలి సభ్యులుగా, మరో ఇద్దరిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించింది. పాలకమండలిలో నెల్లూరుజిల్లా నుంచి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు, పచ్చిపాల సనత్ కుమార్‌రెడ్డికు చోటు లభించింది. సనత్ కుమార్‌రెడ్డి స్వస్థలం విడవలూరు. గత రెండు దశాబ్దాలుగా ఆయన చెన్నైలో చార్టెర్డ్ అకౌంటెంట్‌గా ఉన్నారు. టిటిడి ప్రత్యేక ఆహ్వానితుడిగా విడవలూరు మండలం, పార్లపల్లికి చెందిన 'వంశీరామ్' బిల్డర్స్ వ్యవస్థాపకులు బద్వేలు సుబ్బారెడ్డి నియమితులయ్యారు. దీంతో మొత్తం నలుగురు జిల్లావాసులకు శ్రీవారి సేవాభాగ్యం లభించినట్లయ్యింది. గత ఆగస్టు 8న టిటిడి బోర్డు ఛైర్మన్‌గా వైవి సుబ్బారెడ్డి రెండవసారి నియమితులైన విషయం తెలిసిందే. ఈసారి టిటిడి ఆలయ ప్రత్యేక ఆహ్వానితులుగా మరో 50 మందిని నియమించారు.

**ప్రశాంతిరెడ్డికి మరోసారి శ్రీవారి సేవాభాగ్యం**

తొలినుంచి ఆధ్యాత్మిక రంగానికి తమవంతు సేవలందిస్తూ, జిల్లాలో అనేక ఆలయాల అభ్యున్నతికి, ధార్మిక కార్యక్రమాలకు సారధిగా ఉంటున్న వదాన్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు. ప్రత్యేకించి తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిపై వారికి ఎనలేని భక్తి. తిరుమలేశుని ఆలయంలో జరుగుతున్న సేవలను నెల్లూరు జిల్లా ప్రజలు కూడా స్వయంగా చూసి తరించాలని ఆకాంక్షిస్తూ నెల్లూరులో తిరుమలేశుని వైభవోత్సవాలను 'నభూతో న భవిష్యతి' అనే రీతిలో నిర్వహించి జిల్లా ప్రజల అభినందనలు అందుకున్న పుణ్య దంపతులు వీరు. రాజ్యసభ సభ్యునిగా, ధార్మిక కార్యక్రమాల సారధిగా ఉన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి తాజాగా టిటిడి బోర్డులో రెండవసారి కూడా సభ్యురాలిగా అవకాశం లభించడమంటే ఆ దేవదేవుని దివ్యాశీస్సులు వారికి సంపూర్ణంగా లభించినట్లే. అటు ఆధ్యాత్మిక రంగానికి, ఇటు సామాజిక సేవారంగానికి నిరుపమానమైన సేవలందిస్తున్న సౌజన్యమూర్తులైన వేమిరెడ్డి దంపతులంటే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కూడా ప్రత్యేకమైన అభిమానం. అందుకే రెండవసారి కూడా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి శ్రీవారి సేవాభాగ్యాన్ని కల్పించి వారి సేవలకు సార్థకత చేకూరేలా చేశారు ముఖ్యమంత్రి. శ్రీవారి సేవ లభించడం తమ పూర్వజన్మ సుకృతంగా భావించే ప్రశాంతిరెడ్డికి టిటిడి బోర్డులో రెండవసారి అవకాశం లభించడం పట్ల జిల్లాలోని శ్రీవారి భక్తులు, ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ వేమిరెడ్డి దంపతులకు తమ అభినందనలు, శుభాకాంక్షలు చెప్తున్నారు.

**కిలివేటి సంజీవయ్యకు అరుదైన అవకాశం :**

నిరాడంబరుడు.. నిరంతర ప్రజాసేవకుడు.. సూళ్ళూరుపేట శాసనసభ్యుడు కిలివేటి సంజీవయ్య. ఒక్కరోజు కాదు కదా ఒక్క గంట కూడా విశ్రమించరాయన. ఎల్లవేళలా తన నియోజకవర్గ ప్రజల అభ్యున్నతి ధ్యేయంగా నిత్యం ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తూనే ఉంటారు. ప్రత్యేకించి ముఖ్యమంత్రి కార్యక్రమాలను, సందేశాలను ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుంటూ తమ నియోజకవర్గంలో కూడా ఆయా పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ఆయన తీసుకునే శ్రద్ధ అపారం. నియోజకవర్గ ప్రజలకే కాక, జిల్లా ప్రజలందరికీ ఆయన నిస్వార్థ సేవలు తెలిసినవే. అందుకే ఎప్పుడూ ప్రజాసేవలో తరించే సంజీవయ్యకు ఈసారి శ్రీవారి సేవాభాగ్యం కూడా లభించింది. కిలివేటికి టిటిడిలో బోర్డులో పదవి రావడంతో... మా నాయకుడికి మంత్రి పదవి వస్తుందని ఆశిస్తుంటే.. టిటిడి బోర్డుతో సరిపెడతారా? అన్న అనుమానం సంజీవయ్య అనుచరులను కలవరపెడుతోంది.

ఆ దేవదేవుని సేవలో తరించనున్న మన నెల్లూరీయులైన ఈ నలుగురికీ 'లాయర్' శుభాభినందనలు!..




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com